PRGI NO TGTEL/26/A2948

జ్యోతి **శ్వేత**

JYYOTHI SHWETHA

దినపత్రిక

జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

హైదరాబాద్ ॥ సంపుటి:1 ॥ సంచిక: 15 ॥ ఆదివారం ॥ 14-6-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-





# భారీ వర్షాలపై అప్రమత్తం

## అధికారులకు సీఎం ఆదేశాలు.. అత్యవసర సమీక్ష సమావేశం

## సేవలకు అంతరాయం లేకుండా చర్యలు



**హైదరాబాద్, జూన్ 13 :** నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందు లు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించా రు. పోలీసు శాఖ, ట్రాఫిక్ పోలీసులు, పురపాలక శాఖ, హైడ్రా, విద్యుత్ పంపిణీ సంస్థలు, జలమండలి సహా అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వర్షాల కారణంగా తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాల ని సూచించారు. పరిస్థితిని (మిగతా 2వ పేజీలో)

# భార్య కళ్లెదుటే.. భర్త, కుమార్తె మృతి

పచ్చని ఆ కుటుంబంలో గాలివాన బీభత్సం సృష్టించింది. కరెంట్ షాక్ తీవ్ర విషాదాన్ని నింపింది. కళ్ల ముందే భర్తకు, కుమార్తెకు ఏమైందో తెలియక తల్లడిల్లిన గృహిణి.. వారు విద్యుదాఘాతంతో మృతిచెందారని తెలిసి కన్నీరుమున్నీరయ్యారు. అల్వాల్ పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. కానాజిగూడ టెలికాం కాలనీలో సందీప్ (45).. భార్య శ్వేత, కుమార్తె రుత్విక (16)తో కలిసి నివసిస్తున్నారు. రుత్విక ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది.

సందీప్ బాలానగర్‌లోని బేకరీలో పనిచేస్తున్నారు. శనివారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో గాలిదుమారంతో వర్షం మొదలైంది. మరోవైపు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. చెట్టు విరిగిన శబ్దం రావడంతో దాని కింద ఉన్న కారును పక్కకు తీసేందుకు భార్య, కుమార్తెతో కలిసి సందీప్ బయటకు వచ్చారు. ఆయన కారు ఎక్కి.. పక్కకు తీసే క్రమంలో పెద్ద శబ్దంతో చెట్టు కూలిపోవడంతో విద్యుత్తు తీగ తెగి కారుపై పడింది.

అంతలోనే కరెంటు రావడంతో సమీపంలో ఉన్న ఆయన భార్య స్వల్పంగా విద్యుదాఘాతానికి గురై అరుస్తూ అలాగే ఉండిపోయారు. ఇది గమనించిన కుమార్తె తల్లి వద్దకు వెళ్లే ప్రయత్నంలో కారును తాకింది. కారుకు అప్పటికే కరెంటు ప్రవహిస్తుండడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై ఒరిగిపోయింది. కుమార్తెకు ఏమైందోనని తండ్రి కారులోంచి కాలు నేలపై పెట్టగానే (మిగతా 2వ పేజీలో)



# ఖమ్మం ఘటనపై కవిత ఆగ్రహం

### నిందితుడికి ఉరిశిక్ష డిమాండ్

### బాధిత కుటుంబానికి అండ కోరింపు

### ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, జూన్ 13**

ఖమ్మంలో జరిగిన దారుణ ఘటనపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన లో నిందితుడికి కఠిన శిక్ష విధించాలని, ఉరిశిక్ష అమలు చేయా లని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సహాయం అందించి అన్ని విధాలుగా

(మిగతా 5వ పేజీలో)

### అభిషేక్ ఇంట్లో

# సోదాలు

### అర్ధరాత్రి తనిఖీలు కలకలం

**కోల్‌కతా, జూన్ 13**

తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ నివాసంలో శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు నిర్వహిం చిన సోదాలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. భూ కుం భకోణానికి సంబంధించిన దర్యాప్తు నేప థ్యంలో కాళీఘాట్‌లోని ఆయన నివాసాని కి చేరుకున్న అధికారులు గంటల తరబడి తనిఖీలు నిర్వహించారు. (మిగతా 2వ పేజీలో)



# సింగరేణి ప్రైవేటీకరణకు కుట్ర

## ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

భారాస పదేళ్ల పాలనలో కేంద్రంలోని భాజపా ప్రభుత్వంతో కలిసి సింగరేణి సంస్థను ప్రైవేటుపరం చేసేందుకు కుట్రలు చేసిందని, తాము అధికారంలోకి వచ్చాక వాటిని అడ్డుకోవడంతో మాపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్‌రావు అబద్ధాలరావుగా మారారని ఎద్దేవాచేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సింగరేణికి రావాల్సిన వాటాలను ప్రైవేటు సంస్థలకు చెందేలా ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. మంచిర్యాలలో శనివారం సాయంత్రం మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాశ్‌జ్యోతితో కలిసి 335 మంది సింగరేణి కార్మికుల వారసులకు కారుణ్య నియమాక పత్రాలను ఆయన పంపిణీ చేశారు.

భట్టి మాట్లాడుతూ.. 'కిషన్‌రెడ్డికి తెలంగాణపై ప్రేమ ఉ ంటే 2023లో తాడిచెర్ల-2 బ్లాక్ సింగరేణికి దక్కేలా చూసేవారు. ఈ విషయంపై నేనే లేఖ రాసి, పలుమార్లు స్వయంగా కలిస్తే స్పందించకపోగా.. సత్తుపల్లి-3, కోల్ బ్లాక్-3, కొయ్యగూడ వేలంలో కూడా సింగరేణి పాల్గొన కుండా చేశారు. ఆయనకు అనుకూలమైన ఇద్దరు ప్రైవేటు వ్యక్తుల కోసం సింగరేణి రూ.9,746 కోట్ల లాభం కోల్పో యేలా కుట్రపూరితంగా వ్యవహరించారు. దీనిని లెక్కాప త్రాలతో నిరూపించడానికి నేను (మిగతా 2వ పేజీలో)



### సింగరేణిలో 'బొగ్గు మాయం'పై

# విచారణ జరిపించండి

### రేవంత్‌కు కిషన్‌రెడ్డి లేఖ

**హైదరాబాద్, :**

సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. సింగరేణిలో అవకతవకలు జరిగా యంటూ వచ్చిన వార్తలపై ఆందోళన వ్యక్తం చేశారు. "సింగరేణి నుంచి దాదాపు రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైం దని మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలి. భద్రతను కఠినతరం చేయాలి. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి రూ.51, 500 కోట్లకు పై గా బకాయి పడి ఉంది. దీంతో సంస పై ఆర్థిక ఒత్తిడి నెలకొంది. సంస్థలో సేఫ్‌గార్డ్స్, ఇంటర్నల్ కంట్రోల్ సిస్టమ్ పనితీరును సమీక్షించాలి.



### కాంగ్రెస్‌పై కేటీఆర్

# విమర్శలు


డిజిటల్ సభ్యత్వానికి శ్రీకారం

కార్యకర్తలకు దిశానిర్దేశం

మళ్లీ గులాబీ జెండా లక్ష్యం

**వేములవాడ, జూన్ 13 :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజక వర్గంలో నిర్వహించిన డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు.

(మిగతా 2వ పేజీలో)



## అమెరికా దాడులపై భారత్ ఆగ్రహం

### జైశంకర్ తీవ్ర నిరసన

న్యూఢిల్లీ, జూన్ 13 భారతీయుల ప్రాణాలు కోల్పో యిన నేపథ్యంలో ఈ అంశాన్ని అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్న ట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసి ంది. సముద్ర వాణిజ్య మార్గాల్లో ప్రయాణించే నౌకల భద్రతకు భంగం (మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

**మేషం :** పట్టుదలతో శ్రమిస్తే అనుకున్న పనులు సత్ఫలితాలను ఇస్తాయి. ఉద్యోగంలో ఒత్తిడులు ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసంతో వాటిని అధిగమించగలరు. వ్యాపార రంగంలో తొందరపాటు నిర్ణయాలు పనికిరావు, అలాగే ఆర్థికంగా ఖర్చులు నియంత్రించుకోవడం ఎంతో అవసరం. ఈ రోజు నవగ్రహ ధ్యానం చేయడం శుభకరం.

**వృషభం :** గ్రహచార అనుకూలత వల్ల ప్రారంభించిన పనులు వేగంగా పూర్తవుతాయి. ఉద్యోగంలో పదోన్నతులు, ఉన్నతాధికారుల నుంచి ఆశించిన గౌరవం లభిస్తాయి. మిత్రుల సహకారంతో వ్యాపార రంగంలో మంచి ధనలాభాలు సాధిస్తారు. శ్రీలక్ష్మీదేవిని ఆరాధించడం వల్ల మరింత మేలు జరుగుతుంది.

**మిథునం :** బాధ్యతలను సకాలంలో పూర్తి చేయడం వల్ల ఉన్నతాధికారుల నుంచి గుర్తింపు లభిస్తుంది. వ్యాపారంలో ముందస్తు వ్యూహాలు ఆశించిన లాభాలను తెచ్చిపెడతాయి. ఆర్థికంగా కొత్త అవకాశాలు కలిసి వస్తాయి, కాబట్టి వివాదాలకు దూరంగా ఉండడం మంచిది. విష్ణు సహస్రనామ పఠనం శుభప్రదం.

**కర్కాటకం :** మనోధైర్యంతో ముందడుగు వేస్తే లక్ష్యాలను సులభంగా చేరుకుంటారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. ఉద్యోగంలో శుభ ఫలితాలు ఉంటాయి. వ్యాపార సంబంధ విషయాల్లో ఏకాగ్రత అవసరం, కుటుంబ సభ్యుల సలహాలు మేలు చేస్తాయి. శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆరాధన శ్రేయస్కరం.

**సింహం :** ప్రస్తుతం అదృష్ట కాలం నడుస్తోంది, మీ కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తుంది. ఉద్యోగంలో కీర్తి ప్రతిష్టలు, ఆదాయ వనరులు క్రమంగా పెరుగుతాయి. ఇతరుల ప్రవర్తన ఇబ్బంది పెట్టినప్పటికీ శాంతంగా, ఓర్పుతో వ్యవహరించాలి. శ్రీలక్ష్మీ ధ్యానం శుభ ఫలితాలను ఇస్తుంది.

**కన్య :** గురుబలం అనుకూలంగా ఉండడం వల్ల ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవచ్చు. ఉద్యోగంలో పూర్వపు శ్రమకు తగిన గుర్తింపు, ఆదాయ వృద్ధి లభిస్తాయి. వ్యాపారంలో ఆటంకాలను సహనంతో అధిగమిస్తారు, ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. నవగ్రహ శ్లోకాలు పఠించడం ఎంతో మంచిది.

**తుల :** పనులను వాయిదా వేయకుండా పట్టుదలతో పూర్తి చేస్తే విజయాలు లభిస్తాయి. వ్యాపారంలో సరైన వ్యూహాలు అనుకూల లాభాలను తెచ్చిపెడతాయి. సవాళ్లు ఎదురైనప్పటికీ కుటుంబ సభ్యుల సూచనలతో అధిగమించగలరు. నవగ్రహ ధ్యానం శుభప్రదం.

**వృశ్చికం :** శుభ యోగం కారణంగా ఉద్యోగంలో మంచి ప్రశంసలు, లబ్ధి చేకూరుతాయి. గృహ, వాహన కొనుగోలు ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వ్యాపారంలో చిన్నపాటి ఇబ్బందులు ఉన్నా ధైర్యంగా అధిగమించి లాభాలు పొందుతారు. శ్రీలక్ష్మీ ఆరాధన శ్రేయస్సును పెంచుతుంది.

**ధనుస్సు :** ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే విజయం మీకు చేరవవుతుంది. సమాజంలో గౌరవ మర్యాదలు, ఉద్యోగంలో మంచి గుర్తింపు లభిస్తాయి. వ్యాపారంలో ఇబ్బందులను తెలివిగా పరిష్కరిస్తారు, కుటుంబ సభ్యుల సహకారం ఉంటుంది. శ్రీలక్ష్మీ ధ్యానం శుభకరం.

**మకరం :** ఏకాగ్రతతో పనిచేస్తే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించగలుగుతారు. ఉద్యోగ, ఆర్థిక విషయాల్లో ఆలోచించి తగిన నిర్ణయాలు తీసుకోవాలి. వ్యాపార పెట్టుబడుల విషయంలో లాభ సూచనలు కనిపిస్తున్నాయి. శ్రీసూర్యనారాయణ స్వామి స్మరణ మేలు చేస్తుంది.

**కుంభం :** ముఖ్యమైన వ్యవహారాల్లో అప్రమత్తత అవసరం, కొత్త ప్రయత్నాలు వాయిదా వేయడం మంచిది. ఉద్యోగ బాధ్యతలను సమయానికి పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలి. ఆస్తి, ధన విషయాలలో శాంతంగా, సమష్టిగా నిర్ణయాలు తీసుకోవడం మంచిది. నవగ్రహ శ్లోకాలు శుభప్రదం.

**మీనం :** అదృష్టం తోడుగా ఉండడం వల్ల ఉద్యోగంలో పురోగతి, ప్రశంసలు లభిస్తాయి. వ్యాపారంలో కొత్త అవకాశాలు, పెట్టుబడులు లాభదాయకంగా మారుతాయి. గృహంలో శుభకార్యక్రమాలు జరిగే సూచనలు ఉన్నాయి, ఆస్తి కలిసి వస్తుంది. శ్రీలక్ష్మీ అష్టోత్తరం పఠించడం శ్రేయస్కరం.







# బీజేపి–బీఆర్ఎస్‌ల కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధం. ఎట్టి పరిస్థితుల్లో సింగరేణిని ప్రైవేటుపరం కానివ్వం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రూ.1.25 కోట్ల చొప్పున సింగరేణి కార్మికులకు ప్రమాద బీమా ప్రకటించాం. సంస్థ లాభాల్లో రెగ్యులర్ కార్మికులతోపాటు కాంట్రాక్టు కార్మికులకు కూడా బోనస్ అందించేలా విధానపరమైన నిర్ణయం తీసుకున్నాం. భాజపా రాజ్యాంగాన్ని, ఎన్నికల సంఘాన్ని ప్రభావితం చేస్తోంది. వారికి నచ్చిన వారినే గెలిపించేలా దాన్ని తయారు చేస్తోంది. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరించటం అందులో భాగమే. ప్రజాస్వామ్యానికి ఇది ప్రమాద ఘంటిక' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అధ్యక్షత వహించగా ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్సీలు దండె విఠల్, ఎమ్మెల్యేలు వినోద్, మక్కాన్‌సింగ్, గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ కుమార్‌దీపక్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు దండేపల్లి మండలం గూడెం గ్రామంలోని శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.70 కోట్ల నిధులు మంజూరు చేయగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రుల బృందంతో కలిసి శంకుస్థాపన చేశారు. అలాగే మంచిర్యాల జిల్లా కేంద్రంలో రూ.3 కోట్లతో చేపట్టిన విశ్వనాథాలయం పునర్నిర్మాణ పనులకు, రూ.1.40 కోట్లతో చేపట్టిన నగర డివిజన్ కార్యాలయాల నిర్మాణాలకు కూడా శంకుస్థాపన చేశారు.

# భారీ వర్షాలపై అప్రమత్తం



(మొదటి పేజీ తరువాయి)

ఎప్పటికప్పుడుపర్యవేక్షించేందుకు అత్యవసర వార్‌రూమ్ సమీక్ష సమావేశాన్ని ముఖ్యమంత్రి ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సహా ఉన్నతాధికారులు పాల్గొని నగర పరిస్థితిని సమీక్షించనున్నారు.భారీ వర్షాల వల్ల నీటిముని గే ప్రాంతాలు,ట్రాఫిక్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు.ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వా లని స్పష్టం చేశారు.అత్యవసర సేవలు నిరంతరం అందు బాటులో ఉండేలా అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని సూచించారు. వర్షాల కారణంగా సాధారణ జనజీవనానికి అంతరాయం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నగర ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే మాత్రమే బయటకు రావాలని అధికారులు సూచిస్తున్నారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# కాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన ఆయన బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు జరిగిన ప్రయాణాన్ని గుర్తుచేశారు. ప్రతికూల పరిస్థితుల్లో నూ పార్టీ నిలబడి ప్రజల మద్దతుతో విజయాలు సాధించిందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.ఎన్నికల సమయ ంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైం దని ఆరోపించారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.రైతుల సమస్యలపై కూడా కేటీఆర్ స్పందించారు. వ్యవసాయ రంగంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం సరైన విధంగా వ్యవహరించడం లేదని విమర్శించారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఓటరు జాబితాల అంశాన్ని ప్రస్తావిస్తూ బూత్ స్థాయిలో కార్యకర్త లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అక్రమ ఓట్లు, డూప్లికేట్ ఓట్లను గుర్తించి ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడా లని పిలుపునిచ్చారు. ప్రతి బూత్‌లో పార్టీకి మెజారిటీ వచ్చేలా కృషి చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.మాజీ ముఖ్యమ ంత్రి కేసీఆర్ హయాంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ను కేటీఆర్ ప్రస్తావించారు. వివాహ సహాయం, విద్యా సంస్థలు, వైద్య కళాశాలలు, సాగునీటి ప్రాజెక్టులు వంటి అనేక కార్యక్రమాల ద్వారా తెలంగాణ అభివృద్ధి సాధించిందని పేర్కొన్నా రు. ప్రస్తుత ప్రభుత్వం ఆ స్థాయి పనితీరు కనబరచలేకపోయిందని విమర్శించారు.ఈ నెల 25 తర్వాత వేములవాడ నియోజకవర్గం లోని ప్రతి మండలాన్ని సందర్శిస్తానని కేటీఆర్ ప్రకటించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను విజయ పథంలో నడిపించి మళ్లీ గులాబీ జెండాను ఎగరవేయడం ఖాయ మని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయ కులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమెరికా దాడులపై భారత్ ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

కలిగించే చర్యలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతాయని భారత్ అభిప్రాయపడింది.భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జైశంకర్ అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో శుక్రవారం సాయంత్రం ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా భారతీయులు ఉన్న నౌకలపై జరిగిన దాడులపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అమాయక నావికుల ప్రాణాలు బలిగొన్న ఘటన అత్యంత విచారకరమని పేర్కొంటూ,ఇలాంటి చర్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించదగినవి కావని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమ వేదికలో కూడా జైశంకర్ వెల్లడించారు.ఇటీవల గల్ఫ్ ప్రాంతంలో జరిగిన దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించడం దేశాన్ని కలచివేసింది. విదేశాల్లో విధులు నిర్వహిస్తున్న భారతీయుల భద్రత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో దాడుల పూర్తి వివరాలను సేకరించడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకునేలా అంతర్జాతీయ వేదికలపై ఒత్తిడి తీసుకురావాలని భారత్ భావిస్తోంది.ఈ ఘటనపై అమెరికాకు భారత్ అధికారికంగా కూడా తన అభ్యంతరాలను తెలియజేసింది. ఢిల్లీలోని అమెరికా దౌత్య కార్యాలయ ప్రతినిధి జేసన్ మీక్స్‌ను విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ రెండుసార్లు పిలిపించి వివరణ కోరింది. భారతీయులు ఉన్న నౌకలపై దాడులు జరగడం పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. సముద్ర మార్గాల్లో ప్రయాణించే వాణిజ్య నౌకలకు పూర్తి రక్షణ కల్పించాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజంపై ఉందని పేర్కొంది.మరోవైపు ఈ దాడులకు ఇరాన్ కారణమని అమె రికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారి తీశాయి.భారతీయులు ఉన్న నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపింది ఇరానేనని ఆయన ఆరోపించారు.అయితే ఈ ఆరోపణలను ఇరాన్ వెంటనే ఖండించింది. తమపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యమని ప్రకటించింది.భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో అమెరికాపై తీవ్ర విమర్శలు చేసింది. వారం రోజుల వ్యవధిలో మూడు నౌకలపై అమెరికా దాడులు జరిగాయని, వాటి కారణంగా ముగ్గురు అమాయక భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. ఈ విషాద ఘటనలపై వస్తున్న విమర్శల నుంచి దృష్టి మళ్లించేందుకే తమపై ఆరోపణలు చేస్తున్నారని ఇరాన్ ఆరోపించింది.ఈ పరిణామాలతో గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

# భార్య కళ్లెదుటే.. భర్త, కుమార్తె మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఎగిరి కిందపడ్డారు. అప్పటికే అక్కడ గుమిగూడిన స్థానికులు కారుకు కరెంటు ప్రవహిస్తోందని హెచ్చరించడంతో కుమార్తెను రక్షించే యత్నంలో తండ్రి కర్ర అనుకొని విద్యుత్తు తీగను పట్టుకోవడంతో తీవ్ర షాక్‌కు గురై వెంటనే మృతి చెందారు. కళ్లముందే జరిగిన ఈ ఘోరాన్ని చూసిన శ్వేత.. భర్త, కుమార్తెలకు సాధారణ ప్రమాదం జరిగిందనుకొని స్థానికుల హెచ్చరికతో ఉన్నచోటే నిల్చుండిపోయారు. తర్వాత ఆమెను కాలనీ వాసులు రక్షించారు. అనంతరం భర్త, కుమార్తె లేరన్న విషయం తెలుసుకొని ఆమె బోరున విలపించారు. ప్రమాదానికి కారణమైన కరెంటు తీగ వీధి దీపాలకు సంబంధించిందని విద్యుత్తు పంపిణీ సంస్థ, తమది కాదని ఎంఎంసీ సర్కిల్ అధికారులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. చివరకు ఇరు విభాగాల అధికారులు చెట్టు కూలడం వల్లే ప్రమాదం జరిగిందని ప్రకటించి చేతులు దులిపేసుకున్నారు. మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జిల్లెలగూడ రాఘవేందర్ కాలనీలో తాటిచెట్టు విరిగిపడిన ఘటనలో సబావత్ లక్ష్మి (75) మృతిచెందారు. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం శాన్‌పేటకు చెందిన సబావత్ లక్ష్మి (75), కుమారుడు వెంకట్‌రామ్, కోడలు లలితతో కలిసి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చారు. జిల్లెలగూడ రాఘవేంద్రనగర్ కాలనీలోని ఓ రేకుల ఇంట్లో అద్దెకు ఉంటూ కూలిపని చేస్తున్నారు. శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో తాటి చెట్టు విరిగి వీరు నిద్రిస్తున్న రేకుల ఇంటిపై పడింది. ఈ ఘటనలో వృద్ధురాలు లక్ష్మికి తీవ్రగాయాలు కాగా.. వెంకట్‌రామ్ కాళ్లకు, లలితకు కంటి వద్ద గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ముగ్గురినీ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ లక్ష్మి శనివారం మృతి చెందారు.

# అభిషేక్ ఇంట్లో సోదాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఘటనతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.సల్బోని ప్రాంతానికి చెందిన భూ వ్యవహారంలో నిందితుడిగా భావిస్తున్న వ్యక్తి కోసం గాలింపు చర్యల్లో భాగంగానే ఈ సోదాలు చేపట్టినట్లు దర్యాప్తు అధికారులు వెల్లడించారు. అభిషేక్ బెనర్జీ నివాసంలో సుమారు నాలుగు గంటలకు పైగా తనిఖీలు కొనసాగినట్లు సమాచారం. అయితే సోదాల సమయంలో కేంద్ర భద్రతా బలగాలు కూడా పాల్గొనడం రాజకీయ వివాదానికి కారణమైంది.అభిషేక్ నివాసం తాళాలు పగులగొట్టి అధికారులు లోపలికి ప్రవేశించారని తృణమూల్ కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.ఈ సమాచారం అందుకున్న వెంటనే పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించినట్లు తెలుస్తోంది. ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్యగా ఈ ఘటనను పార్టీ నేతలు అభివర్ణించారు. సోదాల విషయం వెలుగులోకి రావడంతో తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని నిరసనలు వ్యక్తం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకునే ప్రయత్నమే జరుగుతోందని విమర్శించారు.ఇదే సమయంలో మరో కీలక పరిణామంలో మున్సిపల్ నియామకాల కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే మదన్ మిత్ర నివాసంపై అమలు సంచాలక సంస్థ అధికారులు సోదాలు నిర్వహించారు.పలు మున్సిపాలిటీల్లో నియామకాల సందర్భంగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. దర్యాప్తులో భాగంగా అనర్హులను ఉద్యోగాల్లో నియమించేందుకు భారీ మొత్తంలో నగదు, బంగారం తీసుకున్నారనే ఆరోపణలను అధికారులు పరిశీలిస్తున్నారు. సోదాల సందర్భంగా నగదు, పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వరుసగా తృణమూల్ కాంగ్రెస్ నేతలపై జరుగుతున్న దర్యాప్తు చర్యలు పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరింత వేడిని పెంచుతున్నాయి.

జ్యోతి శ్వేత

## సంపాదకీయం

**ఆదివారం 14-6-2026**

# ఎల్‌నినో కార్యాచరణ ఏదీ?

ఎల్‌నినో హెచ్చరికల నేపథ్యంలో పాలకులు అప్రమత్తం కావాల్సి ఉంది. ముఖ్యంగా సాగు, తాగునీరుతో పాటు, వ్యవసాయ విధానంపై ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం కావాల్సి ఉండగా అంలాంటిదేమీ కనిపించడం లేదు. ఇప్పుడు దీని ప్రభావంతో భారతదేశానికి కరువు కాలం కమ్ముకొస్తుంది. దీనిపై ప్రజలను రైతులను అప్రమత్తం చేయడంతో పాటు, కార్యాచరణకు సిద్ధం కావాల్సి ఉంది. నైరుతి రుతు పవనాల రాకతో వర్షాలు పడతాయి.. వ్యవసాయం బాగుంటుందని ఆశిస్తున్న రైతులకు ఇది అశనిపాతం లాంటిదే. ఎల్ నినో వచ్చేసిందని.. ఈ రుతు పవనాల సమయంలో అది మరింత బలపడుతుందని భాతర వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఇదే సమయంలో ఎల్ నినో ప్రారంభం అయినట్లు జపాన్ వాతావరణ సంస్థ జూన్ 11వ తేదీన అధికారికంగా ప్రకటించటం విశేషం. పసిఫిక్ సముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగటాన్ని ఎల్ నినో అంటారు. సముద్ర ఉపరితల జలాల ఉష్ణోగ్రత సహజంగా 3.4 డిగ్రీలుగా ఉంటుంది. ఇప్పుడు అది పాయింట్ 5 శాతం పెరిగింది. అంటే సముద్రం నీరు ఉండాల్సిన వేడి కంటే అధిక వేడిగా ఉన్నాయి. దీన్ని ఎల్‌నినో అంటారు. జూన్ నుంచి ఆగస్ట్ మధ్య కాలంలో ఎల్‌నినో మరింత బలపడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. జూలై మధ్య నుంచి తూర్పు పసిఫిక్ అంతటా విస్తరిస్తుందని.. ఇదంతా రుతు పవనాల కాలంలోనే జరుగుతుందని వాతావరణ శాఖ నివేదిక స్పష్టం చేస్తుంది. సహజంగా నైరుతి రుతు పవనాల సీజన్ లో చల్లటి వాతావరణంతోపాటు నికరంగా వర్షాలు పడతాయి. ఎల్‌నినో ప్రభావంతో సముద్రం నీరు వేడెక్కటం వల్ల సముద్రం నుంచి భూమిపైకి వేడి గాలులు వీస్తాయి. భూమిపై ఎక్కువగా పొడి వాతావరణం ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వర్షపాతం తక్కువగా ఉంటుంది. దీంతో కరువు వస్తుంది. దీనికితోడు అక్కడక్కడ కుండపోత వర్షాలు ఉంటాయి. క్లౌడ్ బరస్టులు ఉంటాయి. దీని వల్ల విపత్తులు వచ్చే ప్రమాదం ఉంది. వర్షాలు తక్కువగా ఉండటం వల్ల నీళ్ల కొరత ఏర్పడుతుంది. మంచి నీళ్లకు.. సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయి. వ్యవసాయానికి అవసరం అయిన నీళ్లు లేక పంటలు పండవు. ఆదాయం లేక రైతులు, రైతు కూలీలకు ఇబ్బంది వస్తుంది. ఎల్‌నినో అధికారంగా ప్రారంభం అయిన భారత వాతావరణ శాఖ ప్రకటనతో ప్రభుత్వాలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. రైతులు పంటలు సాగు చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అన్నింటికి మించి పంటలకు సంబంధించి ఆరుతడి పంటలకు రైతులను ప్రోత్సాహించాలి. సాగునీటి లభ్యత తక్కువగా ఉంటుంది కాబట్టి, వరి లాంటి పంటలకు రైతులు దూరంగా ఉండాలి. మనకున్న వనరులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కార్యాచరణ సిద్ధం చేయాలి. ఎల్‌నినోకు కారణం ఓ రకంగా చెప్పాలంటే పర్యావరణ విధ్వంసమే. మన చేజేతులా పర్యావరణ విధ్వంసానికి పాల్పడిన పాపానికి విపరీత వాతావరణ పరిస్థితులు ఎదుర్కోబోతున్నాం. వాతావరణ మార్పు, పర్యావరణ వ్యవస్థ నష్టం, భూమి ఎడారీకరణ వంటి తీవ్రమైన పరిణామాలతో మానవ-ప్రేరిత పర్యావరణ నష్టం పెరుగుతుంది. పర్యావరణాన్ని పరిరక్షించడం, భూమి మరియు ప్రకృతిని వాటి సహజ స్థితికి పునరుద్ధరించడం ఇప్పుడు అంరి తక్షణ కర్తవ్యం కావాలి. భూమిని రక్షించడానికి, పునరుద్ధరించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. పర్యావరణ విధ్వంసం నిరంతరంగా సాగడంవ వల్ల మన భూమి భవిష్యత్తు ప్రమాదంలో పడింది. ఎడారీకరణ, భూమి క్షీణత, కరువు అనేది మన కాలంలోని అత్యంత ముఖ్యమైన పర్యావరణ సవాళ్లలో ఒకటి. ఇటీవలే జూన్ 5న

ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నాం. అయినా మనలో మార్పు కానరావడం లేదు. చెరువులను మింగేస్తున్నాం. ప్లాస్టిక్ భూతాన్ని భూమిపైకి వదిలేస్తున్నాం. మన పర్యావరణాన్ని రక్షించడానికి

ప్రపంచవ్యాప్త అవగాహన, కార్యాచరణను ప్రోత్సహించడానికి మాటలతో సరిపెడుతున్నాం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పర్యావరణంపై దృష్టి సారించి, ఏటా చర్యలు తీసుకుని ఉంటే ఇలాంటి ఎల్‌నినో ప్రభఆవాలు వచ్చే వచ్చేవి కావు. ఇప్పటికైనా మనమంతా భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తి, పద్ధతులపై దృష్టి సారించాలి. మన భవిష్యత్తు, మన తరం, భూమి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు ఆ వైపు కార్యాచరణను రూపొందించి కచ్చితంగా అమలు చేయాలి. పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు, సైన్సు సంస్థలు ఎల్‌నినో దుష్ఫలితాలపై విస్తృతంగా ప్రచారంనిర్వహించాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి. ముఖ్యంగా యువతను ఈ కార్యక్రమాల్లో భాగస్వామయ్యం చేయాలి. ద ఈ నిని ప్రజా ఉద్యమంగా దిశా నిర్దేశం చేయాలి. అన్ని పర్యావరణ పరిరక్షణ సంస్థలు, వ్యక్తులు ఒక ఉద్యమంలా ఐక్యంగా పనిచేయడం ద్వారా ధరిత్రిని కాపాడుకోవాలి. ఈ క్రమంలో తక్షణంగా ప్రస్తుత విపత్తును తట్టుకునే కార్యాచరణకు రంగం సిద్ధం చేయాలి. కేంద్రం తక్షణమే రాష్ట్రాలతో సంప్రతింపులు జరిపి వ్యయసాయ స ంక్షోభ నివారణకు చర్యలు తీసుకోవాలి. తాగునీటి సమస్యపైనా చర్చించాలి.

# షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసులు

**మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత**

**సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఆడియో క్లిప్**

**పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించారని ఏఐసీసీ ఆగ్రహం**

**కామారెడ్డి కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గపోరు**

**పోలీసు స్టేషన్ లో మహిళా నేత ఫిర్యాదు**

హైదరాబాద్, జూన్ 13: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో అంతర్గత వివాదాలు మరోసారి రచ్చకెక్కాయి. మహిళలను, పార్టీ రాష్ట్ర నాయకత్వాన్ని కించపరిచేలా వ్యవహరించారనే ఆరోపణలపై కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) సీరియస్‌గా స్పందించింది. మహిళలపై, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌పై షబ్బీర్ అలీ తీవ్రస్థాయిలో అనుచిత వ్యాఖ్యలు చేసినట్లుగా ఉన్న ఓ ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పార్టీ హైకమాండ్ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది.

ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన కాంగ్రెస్ పెద్దలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఇలాంటి వ్యాఖ్యలు చేయడంపైనా, పార్టీ అంతర్గత వ్యవహారాలను పబ్లిక్‌లో చర్చకు తీసుకురావడంపైనా అధిష్టానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. నిబంధనలు ఉల్లంఘించినందుకు తక్షణమే వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో హుకుం జారీ చేసింది.

### కామారెడ్డి కాంగ్రెస్‌లో ముదిరిన వర్గపోరు

ఒకవైపు ఏఐసీసీ షోకాజ్ నోటీసుల కలకలం కొనసాగుతుండగానే.. మరోవైపు కామారెడ్డి జిల్లా కాంగ్రెస్‌లో వర్గపోరు మరింత ముదిరింది. స్థానికంగా షబ్బీర్ అలీ వర్గానికి, చంద్రశేఖర్ రెడ్డి వర్గానికి మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఇదే తరుణంలో, సొంత పార్టీ నేతలే తనపై దుష్ప్రచారం చేస్తూ విమర్శలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పోలీసులను ఆశ్రయించారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వరుసగా జరుగుతున్న ఈ పరిణామాలతో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. అధిష్టానం నోటీసులు, స్థానిక వర్గపోరు, సొంత నేతలపైనే పరస్పర ఆరోపణలు, పోలీసు కేసులతో స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో తీవ్ర ఆందోళనకర పరిస్థితులు



నెలకొన్నాయి. కాంగ్రెస్ అధిష్టానం ఈ పరిణామాలను ఎలా చక్కదిద్దుతుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.



# మహిళలు అభివృద్ధికి చోదకశక్తులు!

**కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి సీతక్క**

## ఆర్టీసీ బస్సులకు ఓనర్లుగా మహిళలు

**సీఎం చేతుల మీదుగా 500 కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీ**

**రాష్ట్రవ్యాప్తంగా మహిళా వారోత్సవాలు విజయవంతం**

హైదరాబాద్, జూన్ 13: మహిళలు వ్యవసాయం నుంచి పారిశ్రామిక, రాజకీయ రంగాల వరకు అన్నింటా రాణించగలరని మహిళా వారోత్సవాలు నిరూపించాయని రాష్ట్ర మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. మహిళా సాధికారతను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా మార్చాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి ఈ ఉత్సవాలు బలమైన పునాది వేశాయన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపడుతుందని, తెలంగాణ మహిళలను దేశానికే ఆదర్శంగా నిలబెడతామని ఆమె ఉద్ఘాటించారు. మహిళలు బలపడితేనే కుటుంబం, తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మంత్రి పేర్కొన్నారు.

### 8 వేల ఇందిరా మహిళా శక్తి భవనాలకు శంకుస్థాపన

ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మహిళా వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వారం రోజుల్లో వేలాది కార్యక్రమాలు నిర్వహించి మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారతకు కొత్త ఊపునిచ్చారు. 8 వేల ఇందిరా మహిళా శక్తి భవనాలకు శంకుస్థాపన, పారిశ్రామికవేత్తల కోసం ఇంక్యుబేటర్లు, రుణమేళాలు, ఖమ్మం జిల్లా మధిరలో మహిళల ఆధ్వర్యంలో తొలి సౌర విద్యుత్ కేంద్రం ఏర్పాటు వంటివి ఈ ఉత్సవాల్లో ప్రత్యేకంగా నిలిచాయి. అలాగే, మహిళల భద్రత కోసం హైదరాబాద్‌లో సఖి నివాస్, బాల్య వివాహం -- బతుకు ఆగంపై అవగాహన, 50 అంగన్‌వాడీ భవనాల ప్రారంభం, బాలికల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు నిర్వహించిన మాక్ అసెంబ్లీలు విశేష స్పందన రాబట్టాయి.

హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన మహిళలతో నిర్వహించిన మహిళా శక్తి మహాసభతో ఈ వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ప్రయాణికులుగా ఉన్న మహిళలు.. బస్సుల యజమానులుగా ఎదిగేలా 553 ఆర్టీసీ బస్సులను సీఎం రేవంత్ రెడ్డి ఈ సభలో లాంఛనంగా ప్రారంభించారు. సంఘాలకు రూ.500 కోట్ల వడ్డీ లేని రుణాలు, బస్సుల అద్దె కింద రూ.20.34 కోట్ల చెక్కులు అందజేశారు. ఉచిత ప్రయాణంతో కుటుంబాలకు కలిగిన రూ.10,700 కోట్ల ఆర్థిక లబ్ధిని వివరించి, మహిళా ప్రగతి పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసిన సంఘాల సభ్యులకు, అధికారులకు, ప్రజలకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలుపుతూ సాధికారత దిశగా ఇదే ఉత్సాహంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.




# అయోధ్య రామ మందిర విరాళాలపై వివాదం

**సిట్ విచారణ కోరిన ట్రస్ట్.. హైకోర్టులో సీబీఐ దర్యాప్తుకై పిల్!**

**ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విజ్ఞప్తి**

**నిధుల దుర్వినియోగంపై కాగ్ ఆడిట్‌కు డిమాండ్**

అయోధ్య, జూన్ 13: అయోధ్య రామ మందిరానికి వచ్చిన విరాళాలు, కానుకల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయంటూ వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ వివాదాస్పద వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం చేత విచారణ జరిపించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను ట్రస్ట్ కోరింది. మరోవైపు, ఈ విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై సీబీఐ చేత స్వతంత్ర దర్యాప్తు జరిపించాలంటూ అలహాబాద్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. న్యాయవాది మోహిత్ అశోక్ దాఖలు చేసిన ఈ పిల్ ద్వారా, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు సంబంధించిన అన్ని బ్యాంకు ఖాతాలపై కగ్ ద్వారా సమగ్రమైన ఆడిట్ కూడా నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

రామ మందిర అకౌంట్స్ ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహించానని చెప్పుకుంటున్న మహిపాల్ సింగ్ చేసిన సంచలన ఆరోపణలతో ఈ మొత్తం వివాదం ఒక్కసారిగా తెరపైకి వచ్చింది. ఆలయ విరాళాల విషయంలో చాలా కాలంగా పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నాయని ఆయన బహిరంగంగా ఆరోపించారు. ఈ ఆర్థిక అక్రమాలపై తాను ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినందుకే, కక్షపూరితంగా తనను విధుల నుంచి తొలగించారని మహిపాల్ సింగ్ వెల్లడించారు. ఈ ఆరోపణలు దేశవ్యాప్తంగా ఉన్న భక్తులలో తీవ్ర చర్చనీయాంశంగా మారడంతో, ఆలయ నిధుల నిర్వహణలో పారదర్శకతను నిరూపించుకునేందుకు ట్రస్ట్ స్వయంగా యోగి ప్రభుత్వం వైపు మొగ్గు చూపింది.

# అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందంపై సస్పెన్స్

**పాక్ ప్రధాని ప్రకటనను తోసిపుచ్చిన ఇరాన్!**

**ఈ ఆదివారమే ఎలక్ట్రానిక్ సంతకాలు అంటూ షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్య**

**'అంత తొందరలేదు.. మరికొంత సమయం పడుతుంది' అని స్పష్టం చేసిన టెహ్రాన్**

గ్లోబల్ డెస్క్, జూన్ 13: పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణ దిశగా అమెరికా-ఇరాన్‌ల మధ్య కుదరబోతున్న చారిత్రాత్మక ఒప్పందంపై అంతర్జాతీయ వేదికపై ఒక్కసారిగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఆదివారం (జూన్ 14న) ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉందని, ఇందుకు సంబంధించి ఇరుపక్షాల ఎలక్ట్రానిక్ సంతకాలు (డిజిటల్ సైనింగ్) మరియు తదుపరి సాంకేతిక స్థాయి చర్చల కోసం పాకిస్థాన్ వేగంగా ఏర్పాట్లు చేస్తోందని పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ శనివారం ప్రకటించారు. ఇరుపక్షాల మధ్య జరుగుతున్న ఈ కీలక చర్చల మధ్యవర్తిత్వంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న పాక్ ప్రధాని నుంచి ఈ అధికారిక ప్రకటన వెలువడటంతో, అంతర్జాతీయ సమాజం పశ్చిమాసియా సంక్షోభానికి త్వరలోనే తెరపడనుందని భావించింది.

అయితే, పాక్ ప్రధాని ప్రకటన వెలువడిన కొన్ని గంటల వ్యవధిలోనే ఇరాన్ దీనిపై గట్టిగా స్పందిస్తూ ఆశలపై నీళ్లు చల్లింది. షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నట్లు ఈ ఆదివారం నాడే ఒప్పందంపై సంతకాలు జరగడం సాధ్యం కాదని, ఇందుకు మరికొంత సమయం పడుతుందని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి స్పష్టం చేశారు. అమెరికా వైపు నుంచి వ్యక్తమవుతున్న కొన్ని అనుమానాలు, వ్యూహాత్మక వైరుధ్యాల నేపథ్యంలో ఒప్పందం కుదిరే కచ్చితమైన తేదీ విషయంలో తాము అత్యంత జాగ్రత్తగా, నిశితంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. అయినప్పటికీ, గత చర్చల ఆధారంగా రూపొందించిన 'ఇస్లామాబాద్ మెమోరాండం'పై రానున్న రోజుల్లో సంతకాలు చేసే అంశాన్ని తాము పూర్తిగా తోసిపుచ్చడం లేదని, ప్రస్తుతానికి మాత్రం ఈ ప్రక్రియ ముగింపునకు మరింత సమయం అవసరమని ఇరాన్ టెహ్రాన్ వేదికగా తేల్చిచెప్పింది.

# వీధి వ్యాపారులకు అండగా నిలవాలి

**హైదరాబాద్, జూన్ 13 :**

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప సముదాయంలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులతో కలిసి పర్యటించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో స్థానిక ప్రజలు తాగునీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ, వీధి వ్యాపారుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రాజీవ్ గృహకల్ప సముదాయంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే వరద నీరు ఇళ్లలోకి చేరుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అర్ధరాత్రి వేళల్లో తక్కువ ఒత్తిడితో తాగునీటిని సరఫరా చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని నివాసితులు వివరించారు. ఉద్యోగాలు, కూలీ పనుల కోసం బయటకు వెళ్లే కుటుంబాలు నీటి సరఫరా సమయాలకారణంగా ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ రాజీవ్ గృహకల్పలో అధిక సంఖ్యలో పేద, మధ్యతరగతి కుటుంబాలు నివసిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా సమయాలను మార్చాలని అధికారులను ఆదేశించారు.



అర్ధరాత్రి కాకుండా సాయంత్రం వేళల్లో నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధి వ్యాపారుల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే, జీవనోపాధి కోసం చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని ఇబ్బందులకు గురిచేయరాదన్నారు. వారి జీవనాధారాన్ని కాపాడేందుకు ప్రత్యామ్నాయ స్థలాలు, ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

# అమ్మవారి సన్నిధిలో మంత్రి అచ్చెన్నాయుడు

**తిరుచానూరు, జూన్ 13 :**

ఆంధ్రప్రదేశ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, రైతాంగ సంక్షేమం, ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి కోసం అమ్మవారి ఆశీస్సులు కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధన కోసం ప్రత్యేకంగా ప్రార్థించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రం మరింత పురోగతి సాధించాలని, ప్రజల జీవితాల్లో సంతోషం నిండాలని అమ్మవారిని వేడుకున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు చూపిన విశ్వాసం, మద్దతు వల్లే ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయగలుగుతోందని పేర్కొన్నారు. ప్రజల నమ్మకమే తమకు మరింత బాధ్యతను కల్పిస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అచ్చెన్నాయుడు తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, వ్యవసాయ రంగ బలోపేతం, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వం ముందడుగు వేస్తోందని చెప్పారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రజల సహకారం, ఆశీస్సులతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. అమ్మవారి కృప, ప్రజల ఆశీర్వాదాలు ఉంటే రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అచ్చెన్నాయుడు విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధే తమ ధ్యేయమని, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మరోసారి పునరుద్ఘాటించారు.



# రాజాపేట పోలీస్ స్టేషన్ తనిఖీ

**యాదాద్రి భువనగిరి, జూన్ 13 :**

యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అక్షాన్ష్ యాదవ్ రాజాపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పలు అంశాలపై సమగ్ర తనిఖీ నిర్వహించారు. స్టేషన్‌లో నిర్వహణ, రికార్డుల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, ప్రజా సేవల అంశాలను పరిశీలిస్తూ అధికారులకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన ఎస్పీ, వాటిని ఎప్పటికప్పుడు నవీకరిస్తూ సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. కేసుల వివరాలు, పరిపాలనా పత్రాలు, ఇతర రికార్డులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఆయన, ప్రతి గ్రామంలోని ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, ప్రధాన కూడళ్ల వద్ద తప్పనిసరిగా నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నేరాల నియంత్రణ, అనుమానాస్పద కదలికల పర్యవేక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ, కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు సానుకూల వాతావరణం కనిపించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పరిశుభ్రత, క్రమబద్ధత పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంచుతాయని వివరించారు. పెట్రోలింగ్ వాహనాల్లో ఉండాల్సిన ప్రథమ చికిత్స పరికరాలు, తాళ్లు, హెచ్చరిక కోన్లు, అత్యవసర లైట్లు, నీటి గొట్టాలు వంటి సామగ్రిని కూడా ఆయన తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా అన్ని పరికరాలు సిద్ధంగా ఉండాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా పోలీసు సిబ్బంది పనిచేయాలని సూచించారు. స్టేషన్ హౌస్ అధికారితో సమావేశమైన ఎస్పీ అక్షాన్ష్ యాదవ్, సిబ్బందిని రొటేషన్ విధానంలో అన్ని విభాగాల్లో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా సాంకేతిక విభాగాలపై అవగాహన పెంచుకొని ఆధునిక పోలీసింగ్‌కు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రజా భద్రత, నేర నియంత్రణ, ప్రజలకు స్నేహపూర్వక పోలీసు సేవలే శాఖ ప్రధాన లక్ష్యాలని ఆయన స్పష్టం చేశారు.



## పుష్కరాల నాటికి ఫ్లైఓవర్



**రాజమహేంద్రవరం, జూన్ 13 :**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న "ప్రగతి పాదయాత్ర"లో భాగంగా రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి దివాన్ చెరువు వద్ద జాతీయ రహదారి-16పై నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్, ఎలివేటెడ్ కారిడార్ పనులను పరిశీలించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రాజెక్టు పురోగతిని సమీక్షించారు. రూ.326.61 కోట్ల వ్యయంతో 2.55 కిలోమీటర్ల పొడవున నిర్మిస్తున్న ఈ ఫ్లైఓవర్, ఎలివేటెడ్ కారిడార్ ప్రాంతీయ రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించనుందని పురందేశ్వరి తెలిపారు. నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించడంతో పాటు ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు.

## అంగన్వాడీ సిబ్బందికి ఊరట

**హైదరాబాద్, జూన్ 13 :**

రాష్ట్రంలోని అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాజీనామా చేసి, అనంతరం ఎన్నికల్లో ఓడిపోయిన అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు తిరిగి విధుల్లో చేరే అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క చొరవతో ఈ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించింది. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా ఎన్నికల్లో పోటీ చేసిన కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన సిబ్బందికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాజీనామా చేసి ఎన్నికల్లో విజయం సాధించని అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల నుంచి వచ్చే అప్పీల్స్‌ను పరిశీలించనున్నారు. వారి పరిస్థితులను సమీక్షించి నిబంధనల మేరకు నిర్ణయం తీసుకోనున్నారు. అయితే సంబంధిత పోస్టుల్లో ఇప్పటికే కొత్త అభ్యర్థులను నియమించని సందర్భాల్లో మాత్రమే పునర్నియామకానికి అవకాశం కల్పించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

# శరత్ బాబు కుటుంబానికి జగన్ భరోసా

**పార్వతీపురం మన్యం, జూన్ 13 :**

పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు నంగిరెడ్డి శరత్ బాబు ఆకస్మిక మరణం పట్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన శరత్ బాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ వారికి ధైర్యం చెప్పారు. మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి ద్వారా విషయం తెలుసుకున్న వైఎస్ జగన్, వెంటనే ఫోన్ ద్వారా నంగిరెడ్డి శరత్ బాబు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ కోసం శరత్ బాబు చేసిన సేవలను ఈ సందర్భంగా జగన్ గుర్తు చేసుకున్నట్లు సమాచారం. యువజన విభాగం నాయకుడిగా పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. ఆయన అకాల మరణం పార్టీకి తీరని లోటని అభిప్రాయపడ్డారు. కుటుంబ సభ్యుల బాధను పంచుకుంటూ వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పార్టీ నాయకులు ముందుండాలని వైఎస్ జగన్ సూచించినట్లు తెలిసింది. శరత్ బాబు కుటుంబానికి అన్ని విధాలుగా తోడుగా నిలవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నంగిరెడ్డి శరత్ బాబు మరణంతో పార్వతీపురం మన్యం జిల్లాలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. పలువురు నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శిస్తూ సంతాపం తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా శరత్ బాబు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన వైఎస్ జగన్, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో పార్టీ ఎల్లప్పుడూ వారి వెంటే ఉంటుందని మరోసారి స్పష్టం చేశారు.





## ఉపాధే ప్రభుత్వ లక్ష్యం

**కర్నూలు, జూన్ 13 :**


ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పార్కులను ఏర్పాటు చేస్తున్నామని, వీటి ద్వారా వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. కర్నూలు పర్యటనలో భాగంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి మీడియాతో మాట్లాడారు. కర్నూలులో నిర్వహించిన భారీ ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించిందని మంత్రి తెలిపారు. మొత్తం 19 ప్రముఖ సంస్థలు ఈ మేళాలో పాల్గొని 1,460 ఉద్యోగ అవకాశాలను యువత ముందుంచాయని చెప్పారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకుని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక వ్యక్తికి ఉద్యోగం లభిస్తే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా బలోపేతం అవుతుందని మంత్రి భరత్ అన్నారు.



## వర్షాకాల సన్నద్ధతపై సమీక్ష

**మల్కాజిగిరి, జూన్ 13 :**

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హస్తినాపురం, సాగర్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాల్లో విస్తృత స్థాయి క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, పారిశుధ్య, విపత్తు స్పందన బృందం, కీటక నియంత్రణ విభాగం, ర్యాంకీ సంస్థ ప్రతినిధులతో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షపు నీటి కాలువలు, ప్రధాన నాలాలు, చెరువులకు అనుసంధాన మార్గాలు, నీరు నిలిచిపోయే ప్రమాదం ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. భారీ వర్షాల సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించే పనులను వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశించారు. వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతున్న ఆక్రమణలు, అడ్డంకులను గుర్తించి వెంటనే తొలగించాలని సూచించారు. నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు కీటక నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.



## మంటల్లో చిక్కుకున్న బస్సు

**తిరుపతి, జూన్ 13 :**

తిరుపతి జిల్లా తడ సమీపంలో శనివారం పెను ప్రమాదం తృటిలో తప్పింది. శ్రీసిటీలోని ఐఎంఓపీ సంస్థ ఉద్యోగులను తీసుకెళ్తున్న ప్రైవేటు బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఒక్కసారిగా భయాందోళన నెలకొంది. విధులు ముగించుకుని సూళ్లూరుపేట వైపు వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సులో ఉన్న ఉద్యోగులు క్షణాల్లోనే ప్రాణభయంతో పరుగులు తీశారు. ప్రయాణ మధ్యలో బస్సు వెనుక భాగం నుంచి పొగలు వస్తున్నట్లు గమనించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తమయ్యాడు. పరిస్థితి ప్రమాదకరంగా మారుతుందని గుర్తించి వాహనాన్ని రహదారి పక్కన నిలిపివేశాడు. బస్సులో ఉన్న ఉద్యోగులందరినీ వెంటనే కిందకు దిగాలని హెచ్చరించాడు. డ్రైవర్ సూచనలతో ప్రయాణికులు వేగంగా బస్సు నుంచి బయటకు రావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఉద్యోగులంతా కిందకు దిగిన కొద్దిసేపటికే మంటలు ఒక్కసారిగా బస్సు మొత్తం వ్యాపించాయి. క్షణాల్లోనే వాహనం అగ్నికీలల్లో చిక్కుకుంది. భారీగా మంటలు ఎగసిపడటంతో దూరం నుంచే పొగలు కనిపించాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు.




# ఓటరు జాబితాపై కాంగ్రెస్ దృష్టి

**నల్లగొండ, జూన్ 13 :**

నల్లగొండలోని ఎంఎన్ఆర్ గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎస్ఐఆర్ ఇన్‌చార్జి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు జాబితా అత్యంత కీలకమని అన్నారు. ప్రతి బూత్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తూ అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి జాబితాలో పేరు నమోదు అయ్యేలా చూడాలని పిలుపునిచ్చారు. ఇతర రాష్ట్రాల్లో ఓటర్ల పేర్లు తొలగింపునకు సంబంధించిన వివాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో తెలంగాణలో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగించబడకూడదని స్పష్టం చేశారు. జూన్ 25 నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. పేదలు, యువత, రైతులు సహా అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయిలో పని చేయాలని కోరారు. ఓటరు నమోదు ప్రక్రియలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన సహాయం అందించాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి ఇంటికి చేరుకుని ఓటరు జాబితా వివరాలను పరిశీలించాలని చెప్పారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటరు హక్కు అత్యంత ముఖ్యమని వివరించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కార్యకర్తలే ప్రధాన బలమని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ప్రతి బూత్‌లో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించి ప్రజలతో మమేకం కావాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



# నర్సారెడ్డికి ఘన నివాళి

**నిర్మల్, జూన్ 13 :**

నిర్మల్ బస్టాండ్ ఎదురుగా ఉన్న మాజీ మంత్రి, ఉమ్మడి రాష్ట్ర మాజీ పీసీసీ అధ్యక్షుడు పొద్దుటూరి నర్సారెడ్డి విగ్రహానికి మంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి ప్రజా జీవితంలో చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన కృషిని కొనియాడారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా, మంత్రిగా పొద్దుటూరి నర్సారెడ్డి అందించిన సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పనిచేసిన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని అన్నారు. ఉమ్మడి రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా, మంత్రిగా నర్సారెడ్డి విశిష్ట సేవలు అందించారని జూపల్లి గుర్తుచేశారు. రాజకీయాల్లో విలువలు, నిబద్ధతకు ఆయన ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజా సేవను జీవిత లక్ష్యంగా చేసుకుని నిస్వార్థంగా పనిచేసిన మహానేతగా ఆయనను అభివర్ణించారు. నిర్మల్ జిల్లా అభివృద్ధికి నర్సారెడ్డి చేసిన కృషి మరువలేనిదని మంత్రి తెలిపారు. స్వర్ణ ప్రాజెక్టు, దోనిగాం ప్రాజెక్టు, నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఏర్పాటు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాల వెనుక ఆయన కీలక పాత్ర ఉందన్నారు. ప్రాంత ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన నాయకుడిగా నర్సారెడ్డి చరిత్రలో నిలిచిపోయారని జూపల్లి పేర్కొన్నారు. ఆయన చేపట్టిన కార్యక్రమాల ఫలితాలు ఇప్పటికీ ప్రజలకు ఉపయోగపడుతున్నాయని అన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా జీవించిన నర్సారెడ్డి ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ప్రజల కోసం అంకితభావంతో పనిచేసిన ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని యువతకు పిలుపునిచ్చారు.

# వర్షాకాల సన్నద్ధతపై సమీక్ష

**మల్కాజిగిరి, జూన్ 13 :**

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హస్తినాపురం, సాగర్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాల్లో విస్తృత స్థాయి క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, పారిశుధ్య, విపత్తు స్పందన బృందం, కీటక నియంత్రణ విభాగం, ర్యాంకీ సంస్థ ప్రతినిధులతో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షపు నీటి కాలువలు, ప్రధాన నాలాలు, చెరువులకు అనుసంధాన మార్గాలు, నీరు నిలిచిపోయే ప్రమాదం ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. భారీ వర్షాల సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించే పనులను వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశించారు. వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతున్న ఆక్రమణలు, అడ్డంకులను గుర్తించి వెంటనే తొలగించాలని సూచించారు. నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

# ప్రభుత్వ పాఠశాలలో పరిశుభ్రత

**కరీంనగర్, జూన్ 13 :**



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ సేవలో కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. “మన బడి మన బాధ్యత” కార్యక్రమం కింద కుసుమ రామయ్య ప్రభుత్వ పాఠశాలలో స్వయంగా శుభ్రత పనులు చేపట్టి విద్యార్థులకు పరిశుభ్రమైన విద్యా వాతావరణం కల్పించాలనే సందేశాన్ని ఇచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవకు అంకితమైన పన్నెండు సంవత్సరాల ప్రయాణం స్ఫూర్తితో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బండి సంజయ్ తెలిపారు. విద్యార్థులు కొత్త విద్యా సంవత్సరాన్ని పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన పాఠశాలల్లో ప్రారంభించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో బీజేపీ కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు పెద్దఎత్తున పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాల ఆవరణలు, తరగతి గదులు, క్రీడా ప్రాంగణాలను శుభ్రపరిచి విద్యార్థులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించేందుకు కృషి చేశారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజం కూడా భాగస్వామ్యం కావాలని బండి సంజయ్ పేర్కొన్నారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, సామాజిక సేవకులు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన పాఠశాలలు, మెరుగైన విద్యా వాతావరణం లక్ష్యంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని బండి సంజయ్ తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం కోసం సమాజంలోని అన్ని వర్గాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

# నిర్మల్‌కు నేత్ర సేవల వరం

**నిర్మల్, జూన్ 13 :**



నిర్మల్ పట్టణంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూచాడి సత్యమ్మ ప్రకాశ్‌రావు కంటి పరీక్ష కేంద్రాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ముఖ్యంగా పేదలు, గ్రామీణ ప్రాంత ప్రజలు కంటి పరీక్షల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నిర్మల్‌లోనే సేవలు పొందగలరని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ప్రారంభ దశలోనే కంటి సంబంధిత సమస్యలను గుర్తించే అవకాశం కలుగుతుందని మంత్రి వివరించారు. వ్యాధులను ముందుగానే గుర్తిస్తే చికిత్స సులభమవడంతో పాటు చూపు కోల్పోయే ప్రమాదాన్ని కూడా నివారించవచ్చని చెప్పారు. ప్రజలు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్లిష్టమైన నేత్ర సమస్యలతో బాధపడుతున్న రోగులకు ఈ కేంద్రం కీలక వారధిగా పనిచేయనుందని ఆయన అన్నారు. అవసరమైన సందర్భాల్లో హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ నేత్ర ఆస్పత్రి నిపుణుల సేవలు అందేలా ప్రత్యేక అనుసంధానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో జిల్లాకు చెందిన రోగులు మెరుగైన వైద్య సేవలను సులభంగా పొందగలరని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావడం సమాజ అభి వృద్ధికి ఎంతో అవసరమని జూపల్లి కృష్ణా రావు అభిప్రాయపడ్డారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఇటువంటి వైద్య కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఆరోగ్య సదుపాయాలు ప్రజలకు చేరువ కావడం వల్ల వ్యాధుల భారాన్ని తగ్గించవచ్చని వివరించారు. కంటి ఆరోగ్యం విషయంలో అవగాహన పెంపొందించడం కూడా అత్యంత ముఖ్యమని మంత్రి తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులు, మధుమేహంతో బాధపడేవారు తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సమయానికి చికిత్స పొందడం ద్వారా అనేక నేత్ర సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కేంద్రం ప్రారంభంతో నిర్మల్ జిల్లా ప్రజలకు మెరుగైన నేత్ర వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినట్లేనని ఆయన అన్నారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాలకు అత్యుత్తమ వైద్య సేవలను చేరవేయడంలో ఈ కేంద్రం ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.

# ఉపాధి కూలీలతో పొన్నం

**కరీంనగర్, జూన్ 13 :**



హుస్నాబాద్ నుంచి కరీంనగర్‌కు వెళ్తున్న సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మార్గమధ్యంలో ఉపాధి హామీ పథకం కింద పనులు నిర్వహిస్తున్న కూలీలను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పనులు జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి కూలీలతో నేరుగా మాట్లాడారు. పథకం అమలు తీరుపై కూలీల అభిప్రాయాలను తెలుసుకుంటూ పలు అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనుల పురోగతి, పనుల నిర్వ హణ విధానం, వేతనాల చెల్లింపులు, పని పరిస్థితుల గురించి కూలీలతో చర్చించారు. పనులు సక్రమంగా జరుగుతున్నాయా, కూలీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర వుతున్నాయా అనే విషయాలను స్వయంగా పరిశీలించారు. కూలీల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పరిస్థితిని కూడా మంత్రి పరిశీలించారు. కూలీలకు అవసరమైన తాగునీరు, విశ్రాంతి సదుపాయాలు, ఇతర వసతులు అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాలను తెలుసుకున్నారు. పని ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు ఉపాధి కల్పించడంలో ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తోందని పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ పథకం ద్వారా వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తోందని పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కూడా ఇది తోడ్పడుతోందని వివరించారు. కూలీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి స్పష్టం చేశారు. వేతనాలు సకాలంలో అందేలా, పనులు పారదర్శకంగా జరిగేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కూలీలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజల సంక్షేమం, గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

# హైదరాబాద్‌కు ప్రపంచ గుర్తింపు

**హైదరాబాద్, జూన్ 13 :**

ని యశోద ఆస్పత్రిలో నిర్వహిం చిన వైద్య రంగంలో కృత్రిమ మేధపై అంతర్జాతీయ సదస్సును మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా వైద్యరంగంలో వేగంగా విస్తరిస్తున్న కృత్రిమ మేధ సాంకేతికతపై నిపుణులు, వైద్యులు, పరిశోధకులు చర్చించేందుకు ఈ సదస్సు వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కృత్రిమ మేధ వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీస్తోందని పేర్కొన్నారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్స అందించడం, కొత్త వైద్య పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ఈ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. లక్షలాది మంది ప్రజల జీవితాలను మెరుగుపరిచే సామర్థ్యం కృత్రిమ మేధకు ఉందని శ్రీధర్ బాబు తెలిపారు. రోగ నిర్ధారణ నుంచి చికిత్స వరకు అనేక దశల్లో ఈ సాంకేతికత ఉపయోగపడుతోందని పేర్కొన్నారు.




# కొమురవెల్లికి రైల్వే సౌకర్యం

**సిద్దిపేట, జూన్ 13 :**



తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లన్న స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు నిర్మిస్తున్న కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ ప్రారంభానికి సిద్ధమవుతోంది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి ఈ విషయాన్ని వెల్లడిస్తూ స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. కొమురవెల్లి మల్లన్న స్వామి ఆలయాన్ని ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు సందర్శిస్తుంటారు. ఈ నేపథ్యంలో రైల్వే అనుసంధానం కల్పించడం ద్వారా భక్తులకు ప్రయాణం మరింత సులభతరం కానుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు కూడా ఈ స్టేషన్ ఉపయోగపడనుంది. రూ. 5.63 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు పనులు ఇప్పటికే దాదాపు పూర్తయ్యాయి. అధికారిక సమాచారం ప్రకారం నిర్మాణ పనులు 99 శాతం పూర్తయ్యాయి. మిగిలిన స్వల్ప పనులను వేగంగా పూర్తి చేసి స్టేషన్‌ను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకు రానున్నారు.

# పోలీస్ ఆఫీసర్స్ మెస్ పరిశీలన

**హైదరాబాద్, జూన్ 13 :**



హైదరాబాద్‌లోని ఫస్ట్ లాన్సర్ రోడ్‌లో ఉన్న పోలీస్ ఆఫీసర్స్ మెస్‌ను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ సందర్శించి అక్కడి సౌకర్యాలను సమీక్షించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే పోలీస్ అధికారులకు ఈ మెస్ వసతి కల్పిస్తోందని, ఆరు దశాబ్దాలకు పైగా సేవలు అందిస్తున్న ఈ కేంద్రం పోలీసు శాఖలో ప్రత్యేక గుర్తింపు పొందిందని ఆయన పేర్కొన్నారు. పర్యటన సందర్భంగా వసతి గృహాలు, లౌంజ్‌లు, ఫంక్షన్ హాళ్లు, వంటశాల, వ్యాయామశాల, ఈతకొలను సహా పలు సౌకర్యాలను డీజీపీ పరిశీలించారు. నిర్వహణ ప్రమాణాలు, ప్రస్తుతం కొనసాగుతున్న మౌలిక వసతుల అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. మెస్ నిర్వహణలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని సీవీ ఆనంద్ ఆదేశించారు. ఆతిథ్య సేవలను మరింత మెరుగుపరచడంతో పాటు పార్కింగ్ సౌకర్యాలను విస్తరించాలని సూచించారు. అందుబాటులో ఉన్న స్థలాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ఈ సందర్భంగా మెస్‌కు సంబంధించిన పలు పరిపాలనా అంశాలపై కూడా అధికారులతో చర్చించారు. పోలీసు అధికారులకు మెరుగైన వసతులు కల్పించడం ద్వారా వారి విధి నిర్వహణకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. సిబ్బంది అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిరంతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. తెలంగాణ పోలీసుల ప్రతిష్ఠను ప్రతిబింబించే విధంగా పోలీస్ ఆఫీసర్స్ మెస్ ఉండాలని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. ఈ కేంద్రం అభివృద్ధి పోలీసు సిబ్బంది సంక్షేమానికి దోహదపడటమే కాకుండా శాఖ గౌరవాన్ని మరింత పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# వన్డే క్రికెట్‌లో రోహిత్ శర్మ అరుదైన రికార్డు

**అమర్‌నాథ్ ఘనతకు చెక్**

**ధర్మశాల, జూన్ 13 :**

టీమిండియా స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో మరో విశిష్ట మైలురాయిని అందుకున్నాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో ధర్మశాల వేదికగా జరుగుతున్న తొలి వన్డే మ్యాచ్‌లో బరిలోకి దిగిన హిట్‌మ్యాన్, భారత వన్డే క్రికెట్ చరిత్రలో అత్యంత పెద్ద వయసులో మ్యాచ్ ఆడిన ఆటగాడిగా కొత్త రికార్డు సృష్టించాడు. ఈ క్రమంలో దాదాపు 37 సంవత్సరాలుగా కొనసాగుతున్న మాజీ భారత ఆల్‌రౌండర్ మొహిందర్ అమర్‌నాథ్ రికార్డును అధిగమించాడు. 1989లో తన చివరి వన్డే మ్యాచ్ ఆడిన సమయంలో అమర్‌నాథ్ వయసు 39 సంవత్సరాలు 36 రోజులు. కాగా, ధర్మశాల వన్డేలో రోహిత్ శర్మ 39 సంవత్సరాలు 44 రోజుల వయసుతో మైదానంలోకి అడుగుపెట్టి ఆ ఘనతను తన పేరిట నమోదు చేసుకున్నాడు.హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో




జరుగుతున్న ఈ మ్యాచ్, భారత్-ఆఫ్ఘనిస్థాన్ మధ్య జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో భాగం. 2027 వన్డే ప్రపంచకప్‌కు సన్నాహకంగా ఈ సిరీస్‌కు ప్రత్యేక ప్రాధాన్యం నెలకొంది. విరాట్ కోహ్లీ గాయం కారణంగా ఈ సిరీస్‌కు దూరం కావడంతో యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు రోహిత్ శర్మ అనుభవం కీలకంగా మారింది. ఇటీవల ఐపీఎల్ సమ యంలో ఎదు రైన స్వల్ప గాయం నుంచి పూర్తిగా కోలుకున్న రోహిత్, ఫిట్‌నెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి మళ్లీ జట్టుకు అందుబాటులోకి వచ్చా డు. ఇప్పటికే టెస్టు, టీ20 అంత ర్జాతీ య క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రోహి త్ శర్మ ప్ర స్తుతం వన్డే ఫార్మాట్‌పైనే దృష్టి సారి స్తున్నాడు. 11 వేల కుపైగా వన్డే పరుగులు, మొత్తం అంతర్జాతీయ క్రికె ట్‌లో 20 వేలకు పైగా పరుగులు సాధిం చిన అతడు ఇప్పటికీ అద్భుతమైన ఫిట్ నెస్, నిలకడైన ఫామ్‌తో యువ ఆటగాళ్లకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. 39 ఏళ్ల వయసులోనూ అత్యున్నత స్థాయిలో పోటీ పడుతూ రికార్డులు సృష్టిస్తున్న రోహిత్ శర్మ, భారత క్రికెట్ చరిత్రలో అత్యంత విజయవంతమైన బ్యాటర్లలో ఒకరిగా తన ప్రత్యేక స్థానాన్ని మరింత బలపరుచుకుంటున్నాడు.

# అన్న బాటలో తమ్ముడు..

**సెంచరీతో మెరిసిన ఆశీర్వాద్ సూర్యవంశీ**

**పాట్నా, జూన్ 13 :**

భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెడుతుండగా, అతని తమ్ముడు ఆశీర్వాద్ సూర్యవంశీ కూడా తన ప్రతిభతో క్రికెట్ వర్గాల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. స్థానిక స్థాయి క్రికెట్ పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఆశీర్వాద్ తాజాగా సెంచరీ సాధించి వార్తల్లో నిలిచాడు.సమస్తిపూర్‌లో జరిగిన ఒక స్థానిక మ్యాచ్‌లో తాజ్‌పూర్ క్రికెట్ అకాడమీ తరఫున బరిలోకి దిగిన ఆశీర్వాద్ సూర్యవంశీ 87 బంతుల్లో 103 పరుగులు చేసి జట్టుకు అద్భుత ఇన్నింగ్స్ అందించాడు. అతని ఇన్నింగ్స్‌లో 20 ఫోర్లు, ఒక సిక్సర్ ఉండటం విశేషం. 118.39 పరుగుల వేగంతో బ్యాటింగ్ చేసిన ఆశీర్వాద్ ప్రత్యర్థి బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చెలాయించాడు.తమ్ముడు సెంచరీ సాధించడంతో వైభవ్ సూర్యవంశీ కూడా ఆనందం వ్యక్తం చేశాడు. సామాజిక మాధ్యమాల వేదికగా ఆశీర్వాద్‌కు అభినందనలు తెలియజేస్తూ అతని భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని ఆకాంక్షించాడు. మరోవైపు భారత జట్టుకు వైభవ్ సూర్యవంశీ ఎంపిక కావడంతో కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లివి రుస్తోంది. గ్రామస్థులు ఇంటికి వచ్చి శుభాకాంక్షలు తెలియ జేస్తున్నారని, స్వీట్లు పంచుతూ సంబ రాలు జరుపుకుం



టున్నారని వైభవ్ తండ్రి సంజీవ్ సూర్యవంశీ తెలిపారు. వైభవ్ చిన్నప్పటి నుంచే క్రికెట్‌పై అపారమైన ఆసక్తి చూపించాడని, దేశం తరఫున ఆడాలనే లక్ష్యంతో ఎంతో కష్టపడ్డాడని ఆయన పేర్కొన్నారు. అతని శ్రమకు తగిన ఫలి తం లభించిందని, భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం కుటుంబానికి గర్వకారణమని చెప్పారు.

# ప్రపంచకప్‌కు ముందు ఇంగ్లండ్ జట్టుకు షాక్..

**స్టార్ ఆటగాళ్ల బూట్లు చోరీ**

**కాన్సాస్ సిటీ, జూన్ 13 :**

ఫిఫా ప్రపంచకప్ 2026లో పాల్గొనేందుకు అమెరికా చేరుకున్న ఇంగ్లండ్ జట్టుకు అనుకోని ఎదురుదెబ్బ తగిలింది. జట్టు శిక్షణ కోసం తీసుకెళ్తున్న పలు క్రీడా సామగ్రి, ఆటగాళ్ల వ్యక్తిగత బూట్లు, శిక్షణ పరికరాలు, మ్యాచ్ బంతులు దొంగతనానికి గురికావడంతో ఇంగ్లండ్ శిబిరంలో ఆందోళన నెలకొంది. సమాచారం ప్రకారం, ఫ్లోరిడాలోని శిక్షణ కేంద్రం నుంచి మిస్సోరిలోని స్వోప్ సాకర్ విలేజ్‌కు ఇంగ్లండ్ జట్టు సామగ్రిని ప్రత్యేక వాహనంలో తరలిస్తున్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు వాహనం తాళాలను పగులగొట్టి అందులో ఉన్న సామగ్రిని ఎత్తుకెళ్లారు. దొంగిలించబడిన వస్తువుల్లో ఇంగ్లండ్ జట్టు కెప్టెన్ హ్యారీ కేన్, స్టార్ మిడ్‌ఫీల్డర్ జూడ్ బెల్లింగ్‌హామ్ ఉపయోగించే ప్రత్యేక బూట్లు కూడా ఉన్నట్లు సమాచారం. ఆశ్చర్యకరంగా, దొంగలు వాహనంలో ఉన్న ఒక ఫుట్‌బాల్‌ను మాత్రం వదిలిపెట్టినట్లు తెలుస్తోంది. ఈ ఘటన కారణంగా కాన్సాస్ సిటీలో జరగాల్సిన ఇంగ్లండ్ జట్టు ప్రాక్టీస్ కార్యక్రమాలకు కొంత అంతరాయం ఏర్పడింది. ప్రపంచకప్ తొలి మ్యాచ్‌కు సన్నాహాలు చేస్తున్న సమయంలో ఈ సంఘటన జరగడం జట్టు మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. ఇంగ్లండ్ జట్టు ప్రపంచకప్‌లో తమ తొలి మ్యాచ్‌ను జూన్ 18న క్రొయేషియాతో ఆడనుంది. టోర్నీలో బలమైన జట్లలో ఒకటిగా బరిలోకి దిగుతున్న ఇంగ్లండ్, టైటిల్ లక్ష్యంగా సిద్ధమవుతోంది.




ఇక ఘటనపై స్పందించిన కాన్సాస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు వెల్లడించారు. దొంగిలించబడిన సామగ్రిని త్వరలోనే స్వాధీనం చేసుకునే అవకాశాలు ఉన్నాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.ం

## ప్రపంచకప్‌కు ముందు అమెరికాకు
# కీలక నిఘా చట్టం గడువు ముగింపు

**వాషింగ్టన్, జూన్ 13 :**

ప్రతిష్ఠాత్మక ఫిఫా ప్రపంచకప్ ప్రారంభానికి ముందు అమెరికా జాతీయ భద్రతకు సంబంధించిన కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా నిఘా సంస్థలకు అత్యంత ముఖ్యమైన అధికారాలను కల్పించే ఫారిన్ ఇంటెలిజెన్స్ సర్వైలెన్స్ యాక్ట్ లోని సెక్షన్-702 గడువు ముగియడంతో దేశ భద్రతా వ్యవస్థపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.సీఐఏ, ఎఫ్‌బీఐ, ఎన్ఎస్ఏ వంటి అమెరికా గూఢచార సంస్థలు విదేశాల్లో ఉన్న అనుమానితుల కమ్యూనికేషన్లను పర్యవేక్షించేందుకు ఈ చట్టం కీలకంగా ఉపయోగపడుతోంది. ముఖ్యంగా ఉగ్రవాద కార్యకలాపాలు, విదేశీ గూఢచర్య ప్రయత్నాలను ముందుగానే గుర్తించడంలో సెక్షన్-702 ప్రధాన పాత్ర పోషిస్తోంది.అయితే అమెరికా పౌరుల గోప్యతకు భంగం కలిగించే అవకాశం ఉందన్న కారణంతో ఈ చట్టంపై చాలాకాలంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో చట్టాన్ని పొడిగించేందుకు కాంగ్రెస్‌లో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో గడువు ముగిసిపోయింది. ప్రపంచకప్ భద్రతపైప్రభావంఅమెరికా,కెనడా,మెక్సికోదేశాలుసంయుక్తంగా ఫిఫా ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇస్తున్నాయి. ఈ టోర్నీలో 48 దేశాలు పాల్గొననున్నాయి. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది అభిమానులు మ్యా చ్‌లను వీక్షించేందుకు ఆతిథ్య నగరాలకుచేరుకోనున్నారు. ఇలాంటి భారీ అంతర్జాతీయ క్రీడా ఈవెంట్ సమయంలో నిఘా వ్యవస్థలో చట్టపర మైన అనిశ్చితి నెలకొనడం భద్రతా



వర్గాలను ఆందోళనకు గురి చేస్తోంది. ప్రపంచకప్ సందర్భంగా ఉగ్రవాద ముప్పులను అడ్డుకోవడం తమ అత్యున్నత ప్రాధాన్యత అని ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో ప్రతిష్ఠంభన డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఈ చట్టాన్ని పొడిగించేందుకు ప్రయత్నించినప్పటికీ కాంగ్రెస్‌లో రాజకీయ విభేదాల కారణంగా బిల్లు ఆమోదం పొందలేదు.

# బంగ్లాదేశ్ క్రికెటర్ నయీమ్ హసన్‌పై పోలీసుల దాడి

**చిట్టగాంగ్, జూన్ 13 :**

బంగ్లాదేశ్ జాతీయ టెస్ట్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న యువ ఆఫ్‌స్పిన్నర్ నయీమ్ హసన్‌పై పోలీసుల దాడి జరిగిందన్న ఆరోపణలు సంచలనంగా మారాయి. చిట్టగాం గ్‌లో అర్ధరాత్రి సమయంలో పోలీసులు తనను అడ్డగించి, దురుసుగా ప్రవర్తించడమే కాకుండా శారీరకంగా దాడి చేశారని నయీమ్ ఆరోపించాడు. ప్రీమియర్ లీగ్ మ్యాచ్ ముగించుకుని ఢాకా నుంచి విమానంలో చిట్టగాంగ్ చేరుకున్న నయీమ్ హసన్, అక్కడి నుంచి ఆటోలో ఇంటికి వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలిపాడు. లంకన్ బజార్ ఫ్లైఓవర్ సమీపంలో



పోలీసులు తన ప్రయాణిస్తున్న ఆటోను ఆపి తనిఖీలు నిర్వహించారని, అనంతరం పరిస్థితి ఉద్రిక్తంగా మారిందని పేర్కొన్నాడు. క్రీడా వెబ్‌సైట్‌తో మాట్లాడుతూ నయీమ్, "డ్రైవర్ పత్రాలు పరిశీలించిన తర్వాత అవసరమైతే నా బ్యాగ్ కూడా తనిఖీ చేసుకోవచ్చని చెప్పాను. అయితే పోలీసులు నా గొంతు పట్టుకుని తమ వాహనంలోకి ఎక్కాలని బలవంతం చేశారు. ఎందుకు ఇలా చేస్తున్నారని ప్రశ్నించగా నన్ను బయటకు తోసేసి కొట్టారు. అసభ్యకరంగా దుర్భాషలాడారు. నేను జాతీయ జట్టు తరఫున ఆడే క్రికెటర్‌ని అని చెప్పినా మొదట పట్టించుకోలేదు" అని ఆవేదన వ్యక్తం చేశాడు. తరువాత ఉన్నతాధికారుల నుంచి ఫోన్ కాల్స్ రావడంతోనే పోలీసులు తనతో వ్యవహరించే తీరు మారిందని నయీమ్ తెలిపాడు. ఈ ఘటన బంగ్లాదేశ్ క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యంగా త్వరలో జింబాబ్వేతో జరగనున్న టెస్ట్ సిరీస్‌కు నయీమ్ ఎంపికైన నేపథ్యంలో ఈ సంఘటన మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఘటనపై స్పందించిన చిట్టగాంగ్ మెట్రోపాలిటన్ పోలీస్ డిప్యూటీ కమిషనర్ అమీరుల్ ఇస్లాం పూర్తి స్థాయి విచారణకు ఆదేశించినట్లు వెల్లడించారు. "ఈ అంశాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నాం. ఎవరు తప్పు చేసినా కఠిన చర్యలు తప్పవు. శాఖ ప్రతిష్ఠకు సంబంధించిన విషయం కావడంతో ఎలాంటి రాజీకి తావు ఉండదు" అని స్పష్టం చేశారు.





# అమెరికా ఘన ఆరంభం పరాగ్వేపై నాలుగు గోల్స్‌తో భారీ విజయం

**ఇంగిల్‌వుడ్, జూన్ 13 :**

ఫిఫా ప్రపంచకప్‌లో ఆతిథ్య దేశం అమెరికా విజయవంతమైన ఆరంభం చేసింది. గ్రూప్-డి మ్యాచ్‌లో పరాగ్వేపై 4-1 గోల్స్ తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసి టోర్నీలో శుభారంభం చేసింది. దక్షిణ కాలిఫోర్నియాలో జరిగిన ఈ పోరులో అమెరికా జట్టు ఆరంభం నుంచే పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మ్యాచ్ ప్రారంభమైన ఏడో నిమిషంలోనే డీ బోడాడిల్లా గోల్ చేసి అమెరికాకు ఆధిక్యం అందించాడు. అనంతరం ఫోలారిన్ బలోగన్ 31వ నిమిషం, 45వ నిమిషంలో వరుసగా రెండు గోల్స్ సాధించి జట్టును మరింత బలమైన స్థితిలో నిలిపాడు. దీంతో తొలి అర్ధభాగం ముగిసే సమయానికి అమెరికా 3-0 ఆధిక్యంలో నిలిచింది.

రెండో అర్ధభాగంలో కూడా అమెరికా దూకుడు కొనసాగించింది. మ్యాచ్ చివరి నిమిషంలో జియో రేనా మరో గోల్ నమోదు చేయగా, పరాగ్వే తరఫున మౌరిసియో 73వ నిమిషంలో ఏకైక గోల్ సాధించాడు. ఫలితంగా అమెరికా 4-1 తేడాతో ఘన విజయం అందుకుంది. ప్రపంచకప్ చరిత్రలో అమెరికా ఒకే మ్యాచ్‌లో నాలుగు గోల్స్ చేయడం ఇదే తొలిసారి. అంతేకాకుండా ప్రపంచకప్ పోటీల్లో తొలి అర్ధభాగంలోనే మూడు గోల్స్ నమోదు చేయడం కూడా అమెరికాకు ఇదే మొదటి సందర్భం. ఖతార్‌లో జరిగిన గత ప్రపంచకప్‌లో నాలుగు మ్యాచ్‌లు ఆడిన అమెరికా మొత్తం మూడు గోల్స్ మాత్రమే నమోదు చేసింది. అలాంటి జట్టు ఈసారి తొలి మ్యాచ్‌లోనే నాలుగు గోల్స్ సాధించడం విశేషంగా నిలిచింది. ఈ విజయానికి హీరోగా నిలిచిన ఫోలారిన్ బలోగన్ కథ కూడా ఆసక్తికరంగా మారింది. నైజీరియా మూలాలు కలిగిన బలోగన్ అమెరికాలో జన్మించి, అనంతరం కుటుంబంతో కలిసి ఇంగ్లాండ్‌కు వెళ్లాడు. యువస్థాయిలో ఇంగ్లాండ్‌కు ప్రాతినిధ్యం వహించిన అతడు, చివరకు అమెరికా జట్టును ఎంచుకున్నాడు. ప్రస్తుతం 24 ఏళ్ల వయస్సులోనే ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో రెండు గోల్స్ సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. మరోవైపు ప్రపంచకప్‌కు సహ-ఆతిథ్య దేశంగా ఉన్న కెనడా తన తొలి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. బోస్నియాతో జరిగిన పోరులో ఇరు జట్లు 1-1 గోల్స్‌తో సమంగా నిలిచాయి.



# సెమీస్‌లో సింధుకు నిరాశ ఫైనల్ చేరిన యమగుచి

**సిడ్నీ, జూన్ 13 :**


ఆస్ట్రేలియన్ బ్యాడ్మింటన్ ఓపెన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు పోరాటం సెమీఫైనల్స్‌లో ముగిసింది. జపాన్‌కు చెందిన ప్రపంచ అగ్రశ్రేణి క్రీడాకారిణి అకానే యమగుచి చేతిలో సింధు వరుస గేమ్‌లలో పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. 43 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో యమగుచి 22-20, 21-12 తేడాతో విజయం సాధించింది. ప్రపంచ మూడో ర్యాంక్ క్రీడాకారిణిగా బరిలోకి దిగిన యమగుచి కీలక సందర్భాల్లో మెరుగైన ఆటతీరు ప్రదర్శించి ఫైనల్‌కు అర్హత సాధించింది. మొదటి గేమ్‌లో సింధు గట్టి పోటీ ఇచ్చింది. ప్రతి పాయింట్ కోసం ఇరు క్రీడాకారిణులు తీవ్రంగా పోరాడారు. ఒక దశలో వరుసగా పాయింట్లు సాధిస్తూ సమాన స్థాయిలో నిలిచారు. అయితే గేమ్ ముగింపు సమయంలో యమగుచి మెరుగైన ప్రదర్శన కనబరిచి తొలి గేమ్‌ను సొంతం చేసుకుంది.రెండో గేమ్‌లో మాత్రం యమగుచి పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన జపాన్ క్రీడాకారిణి 13-6 ఆధిక్యంలోకి వెళ్లి సింధుపై ఒత్తిడి పెంచింది. సింధు తిరిగి పోటీలోకి రావడానికి ప్రయత్నించినప్పటికీ యమగుచి అవకాశమే ఇవ్వకుండా మ్యాచ్‌ను ముగించింది.ఈ ఓటమితో ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీలో భారత క్రీడాకారుల ప్రస్థానం ముగిసింది. ఇక మహిళల సింగిల్స్ ఫైనల్లో యమగుచి, థాయ్‌లాండ్‌కు చెందిన పోర్న్‌పావీ చోచువాంగ్‌తో తలపడనుంది.ఇటీవలి కాలంలో యమగుచి చేతిలో సింధు వరుసగా పరాజయాలు ఎదుర్కొంటోంది. గత ఆరు ముఖాముఖి పోటీల్లో ఐదు సార్లు జపాన్ క్రీడాకారిణే విజయం సాధించింది. అయినప్పటికీ మొత్తం ముఖాముఖి రికార్డుల్లో మాత్రం పీవీ సింధు 15-13 ఆధిక్యంలో కొనసాగుతోంది.




# పాస్‌పోర్ట్ రంగుల వెనుక అసలు రహస్యం ఇదే

**హైదరాబాద్, జూన్ 13 :**

విమానాశ్రయాల్లో ఇమ్మిగ్రేషన్ క్యూలలో నిలబడినప్పుడు కొందరి పాస్‌పోర్ట్‌లు నీలం రంగులో, మరికొందరివి తెలుపు, మరికొన్నివి ముదురు ఎరుపు లేదా నారింజ రంగులో కనిపిస్తుంటాయి. ఈ రంగుల మధ్య తేడా ఎందుకు ఉంటుందనే సందేహం చాలామందికి వస్తుంది. పాస్‌పోర్ట్‌ల రంగులను నిర్ణయించే విషయంలో ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి అంత ర్జాతీయ చట్టం లేకపోయినా, ఒక్కో దేశం తన అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక రంగులను ఎంపిక చేస్తుంది. అయితే భారతదేశంలో పాస్‌పోర్ట్ రంగులు వ్యక్తుల హోదా, ప్రయాణ అవసరాలు, విధుల ఆధారంగా నిర్ణ యించబడతాయి. భారతదేశంలో అత్యధిక మంది పౌరులు ఉపయో గించేది నీలం రంగు పాస్‌పోర్ట్. దీనిని వ్యక్తిగత పాస్‌పోర్ట్‌గా పరిగణిస్తారు. విదేశీ పర్యటనలు, విద్య, వ్యాపారం లేదా ఇతర వ్యక్తిగత అవసరాల కోసం విదేశాలకు వెళ్లే సాధారణ పౌరులకు ఈ పాస్‌పోర్ట్ జారీ చేస్తారు.




# నో కాస్ట్ ఈఎంఐ నిజంగానే లాభమా

**హైదరాబాద్, జూన్ 13 :**

డిజిటల్ చెల్లింపుల విస్తరణతో పాటు క్రెడిట్ కార్డుల వినియోగం దేశవ్యాప్తంగా గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా ఆన్‌లైన్ కొనుగోళ్ల సమయంలో అందించే ప్రత్యేక తగ్గింపులు, తక్షణ నగదు తిరిగి చెల్లింపు ఆఫర్లు, సులభ వాయిదా సదుపాయాలు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'నో కాస్ట్ ఈఎంఐ' అనే ఆఫర్‌కు భారీ ఆదరణ లభిస్తోంది. అయితే ఈ సదుపాయం నిజంగా ఎంతవరకు ప్రయోజనకరమనే విషయాన్ని వినియోగదారులు ముందుగా తెలుసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం టెలివిజన్లు, గాలి శీతలీకరణ పరికరాలు, మడత గణక యంత్రాలు, స్మార్ట్‌ఫోన్లు వంటి ఖరీదైన వస్తువులను చాలామంది క్రెడిట్ కార్డు ద్వారా వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారు. వినియోగదారులను ఆకర్షించేందుకు అనేక ఈ-వాణిజ్య సంస్థలు 'నో కాస్ట్ ఈఎంఐ' పేరుతో ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నాయి. సాధారణంగా ఈ సదుపాయంలో వడ్డీ, నిర్వహణ రుసుములు లేదా ఇతర అదనపు ఖర్చులు లేవని ప్రచారం చేస్తారు. అయితే సాధారణ ఈఎంఐ విధానంలో వడ్డీతో పాటు నిర్వహణ రుసుములు, సేవా పన్నులు, ఆలస్య రుసుములు వంటి అదనపు భారాలు ఉంటాయి. నిర్ణీత తేదీలోపు వాయిదా చెల్లించకపోతే అధిక వడ్డీ విధించే అవకాశం కూడా ఉంటుంది. అలాగే రుణాన్ని ముందుగానే పూర్తిగా చెల్లించాలనుకుంటే ముందస్తు ముగింపు రుసుములు కూడా వసూలు చేస్తారు. ఈ రుసుములపై అదనంగా వస్తు సేవల పన్ను కూడా వర్తించడంతో మొత్తం ఖర్చు పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల ఏ వస్తువును వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేసే ముందు సంబంధిత నిబంధనలను పూర్తిగా పరిశీలించడం అవసరం. వడ్డీ రేట్లు, నిర్వహణ రుసుములు, ముందస్తు ముగింపు ఛార్జీలు, ఆలస్య రుసుములు వంటి అంశాలను జాగ్రత్తగా చదవాలి. కేవలం తగ్గింపు లభిస్తోందనే కారణంతో కొనుగోలు చేయకుండా, ఆ వస్తువు నిజంగా అవసరమా అనే విషయాన్ని కూడా పరిశీలించాలి. ప్రస్తుతం అనేక మంది భారీ తగ్గింపుల మోజులో అవసరం లేని వస్తువులను కూడా కొనుగోలు చేస్తున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా 'నో కాస్ట్ ఈఎంఐ' అనే ప్రకటన చూసి వెంటనే నిర్ణయం తీసుకోవడం వల్ల భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. కాబట్టి కొనుగోలు చేసే ముందు కుటుంబ ఆదాయం, నెలవారీ ఖర్చులు, భవిష్యత్ ఆర్థిక బాధ్యతలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవడం ఉత్తమమని సూచిస్తున్నారు. ఆకర్షణీయమైన ఆఫర్లు కనిపించినప్పటికీ, వాటి వెనుక ఉన్న నిబంధనలను పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతే వాయిదాల సదుపాయాన్ని ఉపయోగించుకోవడం ఆర్థికంగా సురక్షితమైన నిర్ణయంగా భావించవచ్చు.

# భగ్గుమంటున్న బంగారం

**హైదరాబాద్ -- 13-06-2026 -- :**



పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావంతో బంగారం ధరలు వరుసగా మూడో రోజు భారీగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి పెరగడంతో పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడులైన బంగారం, వెండివైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో దేశీయ మార్కెట్ల లోనూ బంగారం ధరలు ఊహించని స్థాయి లో ఎగబాకుతున్నాయి. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సై ట్ ప్రకారం శనివారం ఉదయం 10 గంట ల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.500 పెరిగి రూ.1,49, 080కు చేరుకుంది. అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.450 పెరిగి రూ.1,36,650 వద్ద ట్రేడవుతోంది. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర కూడా రూ.370 పెరిగి రూ.1,11,810కు చేరుకుంది. ఇదే సమయంలో వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. 100 గ్రాముల వెండిపై రూ.500, కిలో వెండిపై రూ.5,000 పెరుగుదల నమోదైంది. హైదరాబాద్ మార్కెట్‌లో 100 గ్రాములవెండి రూ.27, 000 వద్ద, కిలోవెండి రూ.2,70, 000 వద్ద ట్రేడవుతోంది.

# ఏఐపై సెబీ కొత్త నిబంధనలు..

## అల్గో ట్రేడింగ్‌కు కళ్లెం మానవ పర్యవేక్షణ తప్పనిసరి

**ముంబై -- 13-06-2026 -- :**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియో గంపై భారత సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు (సెబీ) కీలక సంకేతా లు ఇచ్చింది. బ్రోకర్లు, ఫండ్ హౌస్‌లు ప్రస్తుతం వినియో గిస్తున్న ఆటోమేటెడ్ టూల్స్, అల్గో ట్రేడింగ్ వ్యవస్థలను మరింత పారదర్శకంగా మార్చేందుకు కొత్త నిబంధనలను తీసుకురానుంది. ముఖ్యంగా హై-స్పీడ్ ట్రేడిం గ్ వ్యవస్థల్లో మానవ పర్యవేక్షణను తప్పనిసరి చేయాలని సెబీ భావి స్తోంది. కొత్త నిబంధనల ప్రకారం ట్రేడింగ్ ప్రక్రియను యంత్రాలు నిర్వహించినప్పటికీ, వాటి ఫలితా లకు సంబం ధిత సంస్థలే బాధ్యత వహించాల్సి ఉంటుంది. పెట్టుబడి సలహాల కోసం డేటా మోడల్స్, మెషీన్ లెర్నింగ్ టూల్స్‌ను ఎలా వినియోగిస్తున్నారో నియంత్రిత సంస్థలు తప్పనిసరిగా వెల్లడించాల్సి ఉంటుంది.అల్గారిథమ్‌లలో ఉండే పక్షపాత



ధోరణి, మెషీన్ లెర్నింగ్ అవుట్‌పుట్‌లలో దాగి ఉండే ప్రమాదాలపై సెబీ ఆందోళన వ్యక్తం చేసింది. అందుకే ప్రతి ఆటో మే టెడ్ ట్రేడ్‌ను మానవ పర్య వేక్షకులు సమీక్షించే విధంగా నిబంధనలను రూపొం దిస్తోంది. అంతర్జాతీయ ప్రమాణా లకు అనుగుణంగా భారత మూలధన మార్కెట్లను మరింత బలోపేతం చేయడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశంగా భావిస్తున్నారు. ఈ కొత్త మార్పులతో బ్రోకర్ల అల్గో ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌ల పనితీరులో మార్పులు చోటుచేసు కోనున్నాయి. అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థలు తమ ప్రిడిక్టివ్ మోడళ్లను గత మార్కెట్ డేటాతో సరిపోల్చి పరీక్షించాల్సి ఉంటుంది.




# రూ.2.5 లక్షల్లోపు బెస్ట్ స్క్రాంబ్లర్ ఏది


**హైదరాబాద్ -- 13-06-2026 -- :**

దేశీయ మార్కెట్‌లో అడ్వెంచర్, స్క్రాంబ్లర్ బైక్‌లకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోంది. నగర రోడ్లతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని కంకర రోడ్లు, గుంతలు, తేలికపాటి ఆఫ్‌రోడింగ్ పరిస్థితుల్లోనూ సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తుండటంతో యువత ఈ బైక్‌లపై ఆసక్తి చూపుతోంది. ప్రస్తుతం రూ. 2. 5 లక్షల్లోపు ధరలో రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440, యెజ్డీ స్క్రాంబ్లర్ మోడళ్లు అందుబాటులో ఉన్నాయి.రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440లో 443 సీసీ సింగిల్ సిలిండర్, ఎయిర్ కూల్డ్, ఫ్యూయల్ ఇంజెక్టెడ్ ఇంజిన్‌ను అమర్చారు. ఇది గరిష్ఠంగా 25.4 బీహెచ్‌పీ పవర్, 34 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇందులో 6 స్పీడ్ గేర్‌బాక్స్‌ను అందించారు. తక్కువ ఆర్‌పీఎం వద్ద అధిక టార్క్ అందించడం వల్ల కొండ ప్రాంతాలు, కఠినమైన రోడ్లపై ప్రయాణానికి ఈ బైక్ అనుకూలంగా ఉంటుంది. అదే యెజ్డీ స్క్రాంబ్లర్‌లో 334 సీసీ సింగిల్ సిలిండర్, లిక్విడ్ కూల్డ్ ఇంజిన్‌ను అందించారు. ఇది 29.59 బీహెచ్‌పీ పవర్, 30 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. పవర్ పరంగా యెజ్డీ ముందంజలో ఉండగా, టార్క్ విషయంలో స్క్రామ్ 440 ఆధిపత్యం చూపుతోంది. హైవే రైడింగ్, వేగవంతమైన యాక్సిలరేషన్ కోరుకునేవారికి యెజ్డీ మంచి ఎంపికగా నిలుస్తుంది. డిజైన్ పరంగా స్క్రామ్ 440లో 795 మిల్లీమీటర్ల సీటు ఎత్తు ఉండటంతో పొట్టిగా ఉన్నవారు

## యూపీఐలో పాత బ్యాంక్ ఖాతాలు ఇంకా ఉన్నాయా

**న్యూఢిల్లీ -- 13-06-2026 -- :**

డిజిటల్ చెల్లింపులు విస్తరించిన తర్వాత యూపీఐ ప్రతి ఒక్కరి రోజువారీ జీవితంలో కీలక భాగంగా మారింది. డబ్బు పంపడం, బిల్లులు చెల్లించడం,ఆన్‌లైన్ కొను గోళ్లు చేయడం వంటి పనులన్నీ యూపీఐ ద్వారా సుల భంగా జరుగుతున్నాయి. అయితే బ్యాంక్ ఖాతా మార్చిన తర్వాత చాలామంది పాత బ్యాంక్ ఖాతాను యూపీఐ యాప్‌లో అలాగే ఉంచేస్తున్నారు. ఇదే భవిష్యత్తులో పలు సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. యూపీఐలో ఒకే మొబైల్ నంబర్‌కు ఒకటి కంటే ఎక్కువ బ్యాంక్ ఖాతాలను లింక్ చేసే సౌకర్యం ఉంది. కొత్త బ్యాంక్ ఖాతాను జోడించినా పాత ఖాతా ఆటోమేటిక్‌గా తొలగిపోదు. అది యాప్‌లో కనిపిస్తూనే ఉంటుంది. అందువల్ల అవసరం లేని ఖాతాలను వినియోగదారులు స్వయంగా తొలగించాల్సి ఉంటుంది. వాడని లేదా యాక్టివ్‌లో లేని బ్యాంక్ ఖాతా యూపీఐలో ఉండటం వల్ల లావాదేవీలు విఫలమయ్యే అవకాశం ఉంది. రిఫండ్‌లు ఆలస్యమవడం, ఆటో డెబిట్ చెల్లింపులు నిలిచిపోవడం వంటి సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంటుంది. అలాగే ఒకే యాప్‌లో అనేక బ్యాంక్ ఖాతాలు కనిపిస్తే ప్రస్తుతం ఏ ఖాతా వినియోగంలో ఉందో గుర్తించడం కష్టమవుతుంది. ముఖ్యంగా వృద్ధులు, డిజిటల్ చెల్లింపులకు కొత్తగా అలవాటు పడుతున్న వారికి ఇది గందరగోళానికి దారి తీస్తుంది.




# మైలేజ్ కింగ్‌గా దూసుకెళ్తున్న స్ప్లెండర్..

**హైదరాబాద్, జూన్ 13 :**

భారత ద్విచక్ర వాహన మార్కెట్‌లో ఎన్నో కొత్త మోడళ్లు వచ్చినప్పటికీ హీరో స్ప్లెండర్ ప్లస్‌కు ఉన్న ఆదరణ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. దశాబ్దాలుగా వినియోగదారుల నమ్మకాన్ని సొంతం చేసుకున్న ఈ బైక్, తక్కువ నిర్వహణ ఖర్చు, అద్భుతమైన మైలేజ్, విశ్వసనీయ పనితీరుతో ఇప్పటికీ అత్యధికంగా అమ్ముడవుతున్న ద్విచక్ర వాహనాల్లో ఒకటిగా కొనసాగుతోంది. హీరో మోటోకార్ప్ రూపొందించిన ఈ బైక్‌లో 97.2 సీసీ సామర్థ్యం గల గాలి శీతలీకరణ వ్యవస్థతో పనిచేసే ఏక సిలిండర్ ఇంజిన్‌ను అమర్చారు. ఈ ఇంజిన్ మెరుగైన ఇంధన సామర్థ్యంతో పాటు రోజువారీ ప్రయాణాలకు అనువైన పనితీరును అందిస్తుంది. కంపెనీ వెల్లడించిన వివరాల ప్రకారం, ఒక లీటర్ పెట్రోల్‌తో సుమారు 70 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యం దీనికి ఉంది. పెరుగుతున్న ఇంధన ధరల నేపథ్యంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణించాలనుకునే వారికి ఇది ఉత్తమ




ఎంపికగా నిలుస్తోంది. స్ప్లెండర్ ప్లస్ మరో ప్రధాన ఆకర్షణ దాని సరళమైన రూపకల్పన. ఆడంబరాలకు దూరంగా, సాధారణ వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని దీనిని రూపొందించారు. సౌకర్యవంతమైన సీటు, తక్కువ బరువు, సులభమైన నియంత్రణ వ్యవస్థ కారణంగా అన్ని వయసుల వారు ఈ బైక్‌ను సులభంగా నడపగ లుగుతు న్నారు. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ రహదారులపై కూడా ఇది సమర్థవంతంగా పనిచేస్తుంది.




## మ్యాగీలో పురుగులా వైరల్ ఆరోపణలపై నెస్లే క్లారిటీ

**న్యూఢిల్లీ -- 13-06-2026 -- :**

మ్యాగీ నూడుల్స్‌లో పురుగులు ఉన్నాయం టూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆరోపణలపై నెస్లే ఇండియా స్పందించింది. ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమని కంపెనీ స్పష్టం చేసింది. ఓ నెటిజన్ మ్యాగీ ప్యాకెట్‌లో పురుగులు కనిపించాయని సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ వైరల్ కావడంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. దీనిపై భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ ఎఫ్ఎస్ ఎస్ఏఐ కూడా స్పందించి సంస్థ నుంచి వివరణ కోరింది. స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన ఫైలింగ్‌లో నెస్లే ఇండియా తమ ఉత్పత్తులు అన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా తయారవుతున్నాయని వెల్లడించింది. మ్యాగీపై వచ్చిన ఆరోపణలు ఒక ధ్రువీకరించని సోషల్ మీడియా ఖాతా ద్వారా వెలుగులోకి వచ్చాయని పేర్కొంది. ఫిర్యాదు చేసిన వ్యక్తిని సంప్రదించి సంబంధిత ఉత్పత్తి నమూనాను పంపించాలని పలుమార్లు కోరినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదని కంపెనీ తెలిపింది. దీంతో అసలు ఉత్పత్తిని నేరుగా పరీక్షించే అవకాశం తమకు లభించలేదని వివరించింది. అయితే ఆరోపణలు వచ్చిన బ్యాచ్‌కు సంబంధించిన రిఫరెన్స్ నమూనాలను నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్‌కు పంపించినట్లు నెస్లే వెల్లడించింది. ఆ పరీక్షల్లో ఎలాంటి పురుగులు లేదా ఇతర కలుషిత పదార్థాల ఆనవాళ్లు గుర్తించలేదని, ఉత్పత్తి నాణ్యతా ప్రమాణాలకు పూర్తిగా అనుగుణంగా ఉందని నివేదిక వెల్లడించినట్లు తెలిపింది. వినియోగదారుల భద్రత, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని నెస్లే ఇండియా స్పష్టం చేసింది.




## ఈఎంఐ బకాయిలు ఇల్లు వెంటనే వేలం వేయరా

**హైదరాబాద్, జూన్ 13 :**

నేటి కాలంలో గృహ రుణాలు తీసుకుని ఇళ్లను కొనుగోలు చేస్తున్న వారి సంఖ్య భారీగా పెరిగింది. చాలా మంది తమ నెలవారీ ఆదాయంలో పెద్ద భాగాన్ని గృహ రుణ ఈఎంఐల చెల్లింపులకే కేటాయిస్తున్నారు. దీంతో ఏ పరిస్థితుల్లోనైనా ఈఎంఐలను సకాలంలో చెల్లించాలని ప్రయత్నిస్తుంటారు. అయితే ఒకవేళ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈఎంఐలు చెల్లించలేకపోతే బ్యాంకులు వెంటనే ఇంటిని వేలం వేస్తాయా అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. నిపుణుల ప్రకారం, ఒక్కటి లేదా రెండు ఈఎంఐలు బకాయి పడినంత మాత్రాన బ్యాంకులు వెంటనే ఇంటిని స్వాధీనం చేసుకుని వేలం వేయవు. ముందుగా రుణగ్రహీతకు హెచ్చరికలు జారీ చేసి, బకాయిలను చెల్లించుకునే అవకాశాన్ని కల్పిస్తాయి. సమస్యను పరిష్కరించుకునేందుకు తగిన సమయం కూడా ఇస్తాయి. భారతీయ రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం, వరుసగా మూడు నెలల పాటు లేదా సుమారు 90 రోజుల పాటు ఈఎంఐలు చెల్లించకపోతే ఆ రుణ ఖాతాను నిరర్థక ఆస్తిగా ప్రకటిస్తారు. అనంతరం బ్యాంకు చట్టపరమైన చర్యలకు శ్రీకారం చుడుతుంది. రుణగ్రహీతకు లిఖితపూర్వకంగా నోటీసు జారీ చేసి, బకాయి మొత్తాన్ని చెల్లించేందుకు 60 రోజుల గడువు ఇస్తుంది. ఈ గడువు ముగిసిన తర్వాత కూడా రుణగ్రహీత స్పందించకపోతే బ్యాంకు ఆస్తిని స్వాధీనం చేసుకునే ప్రక్రియను ప్రారంభించవచ్చు. అయితే వేలానికి ముందు కూడా మరో నోటీసు జారీ చేయడం తప్పనిసరి. ఇందులో ఆస్తి విలువ, వేలం తేదీ వంటి వివరాలను పేర్కొంటూ కనీసం 30 రోజుల ముందుగానే సమాచారం అందించాలి. అంటే రుణ ఖాతా నిరర్థక ఆస్తిగా మారిన వెంటనే ఇల్లు వేలం వెళ్లదు. నోటీసులు, గడువులు, చట్టపరమైన ప్రక్రియలన్నీ పూర్తయ్యాకే తదుపరి చర్యలు చేపడతారు.

## 'గదర్'ను మించిన సినిమా లేదు

### అమీషా పటేల్ సంచలన

# వ్యాఖ్యలు

ముంబై -- 13-06-2026 --

బాలీవుడ్ నటి అమీషా పటేల్ తన కెరీర్‌లో అత్యంత గుర్తింపు తెచ్చిపెట్టిన 'గదర్' చిత్రాల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ధురంధర్', 'ధురంధర్: ది రివెంజ్' చిత్రాలు భారీ వసూళ్లు సాధించినప్పటికీ, ప్రేక్షకుల సంఖ్య పరంగా 'గదర్: ఏక్ ప్రేమ్ కథ', 'గదర్ 2' చిత్రాలను మించలేదని ఆమె పేర్కొన్నారు. సన్నీ డియోల్, అమీషా పటేల్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'గదర్: ఏక్ ప్రేమ్ కథ' విడుదలై 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తమ చిత్రం ఇప్పటికీ ఒక ఐకానిక్ సినిమాగా నిలిచిందని, ఇన్ని సంవత్సరాలు గడిచినా ప్రేక్షకులు ప్రేమతో గుర్తు చేసుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని తెలిపారు. 'గదర్ 2' కూడా బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టించిందని అమీషా చెప్పారు. థియేటర్లకు వచ్చి సినిమా చూసిన ప్రేక్షకుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే 'గదర్' సిరీస్ సాధించిన విజయాన్ని మరే చిత్రం అందుకో లేదని ఆమె అభిప్రాయపడ్డారు. భారతీయ సినిమా చరిత్రలో 'గదర్' వంటి చిత్రంలో భాగమవడం తన అదృష్టంగా భావిస్తున్నానని, ఇలాంటి అరుదైన గౌరవం దక్కడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అమీషా పేర్కొన్నారు.



## స్టార్ హీరోయిన్ దిశా పటాని

# సక్సెస్ స్టోరీ ఇదే

ముంబై -- 13-06-2026 --

అందం, గ్లామర్, నటనతో బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయిక దిశా పటాని సినీ ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది. ప్రస్తుతం స్టార్ హీరోయిన్‌గా వెలుగొందుతున్న ఆమె, చిత్రసీమలోకి అడుగుపెట్టిన రోజుల్లో సినిమా ఇండస్ట్రీ గురించి ఎలాంటి అవగాహన లేకుండా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. 1992 జూన్ 13న ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో జన్మించిన దిశా పటాని కుటుంబ మూలాలు ఉత్తరాఖండ్‌లోని తానక్‌పూర్ ప్రాంతానికి చెందినవి. ఆమె తండ్రి జగదీష్ సింగ్ పటాని సీనియర్ పోలీసు అధికారి కాగా, తల్లి ఆరోగ్య శాఖలో పనిచేశారు. చిన్నప్పటి నుంచే చదువులో ప్రతిభ కనబరిచిన దిశా, మొదట ఎయిర్ ఫోర్స్ పైలట్ లేదా శాస్త్రవేత్త కావాలని కలలు కనేది. అందుకే ఇంజినీరింగ్‌లో బయోటెక్నాలజీ చదివింది. కాలేజీ రోజుల్లో స్నేహితురాలి సూచనతో మోడలింగ్ పోటీలో పాల్గొన్న దిశా విజేతగా నిలిచి, ఆ తర్వాత ప్రముఖ బ్రాండ్ల ప్రకటనల్లో నటించే అవకాశాలు అందుకుంది. ప్రకటనల్లో కెమెరాను ఎదుర్కొన్న అనుభవం ఆమెలో నటనపై ఆసక్తిని పెంచింది. దీంతో తన కలలను సాకారం చేసుకోవాలనే లక్ష్యంతో ముంబైకి వెళ్లాలని నిర్ణయించుకుంది. ముంబైకి వచ్చిన సమయంలో తన వద్ద కేవలం రూ.500 మాత్రమే ఉన్నాయని దిశా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది.





## రూ.400 కోట్ల దిశగా

# దూసుకెళ్తున్న పెద్ది

హైదరాబాద్, జూన్ 13 :

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కించిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. భావోద్వేగాలు, క్రీడా నేపథ్యం, గ్రామీణ జీవనశైలిని మేళవించి రూపొందించిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ భారీ వసూళ్లతో ముందుకు సాగుతోంది. విడుదలైన తొలి రోజు నుంచే సానుకూల స్పందన అందుకున్న ఈ చిత్రం తాజాగా మరో కీలక మైలురాయిని చేరుకుంది. విడుదలై తొమ్మిది రోజులు పూర్తైన సందర్భంగా చిత్ర నిర్మాణ సంస్థ ప్రకటించిన వివరాల ప్రకారం, 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా రూ.366 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ఈ వసూళ్లతో రామ్ చరణ్ సినీ ప్రయాణంలో అత్యధిక ఆదరణ పొందిన చిత్రాల్లో ఒకటిగా నిలిచిన 'పెద్ది', సోలో హీరోగా ఆయన నటించిన చిత్రాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా రికార్డు సృష్టించింది. గ్రామీణ నేపథ్యంలో సాగే కథ, క్రీడా అంశాలు, హృదయాన్ని తాకే భావోద్వేగ సన్నివేశాలు అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం వారాంతపు ప్రదర్శనలకు కూడా మంచి స్పందన లభిస్తున్నట్లు సినీ వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాలు, విదేశీ మార్కెట్లలోనూ చిత్రం నిలకడైన వసూళ్లు సాధిస్తోంది. దీంతో 'పెద్ది' త్వరలోనే రూ.400 కోట్ల గ్రాస్ క్లబ్‌లో చేరే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పెద్ద చిత్రాల పోటీ లేకపోవడం, కుటుంబ ప్రేక్షకుల మద్దతు కొనసాగుతుండటం సినిమాకు అదనపు బలంగా మారింది. ముఖ్యంగా రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభిస్తున్నాయి. పాత్రలో ఆయన చూపించిన భావోద్వేగాలు, క్రీడాకారుడి పాత్ర కోసం చేసిన కృషి చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సనా కథను హృద్యంగా తెరకెక్కించడంలో విజయవంతమయ్యారని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 'పెద్ది' విజయయాత్ర ఇంకా కొనసాగుతుండటంతో రాబోయే రోజుల్లో మరిన్ని వసూళ్ల రికార్డులను సొంతం చేసుకునే అవకాశాలు కనిపిస్తు న్నాయి. ప్రస్తుతం సినీ అభిమానుల దృష్టంతా ఈ చిత్రం ఎంత వేగంగా రూ.400 కోట్ల మార్కును చేరు కుంటుందన్న అంశంపైనే కేంద్రీకృతమైంది.

## ఈ వీకెండ్ ఓటీటీలో

# వినోదాల జాతర

హైదరాబాద్ -- 13-06-2026 --

ఈ వారాంతంలో డిజిటల్ వేదికల్లో వినోదాల సందడి మొదలైంది. థ్రిల్లర్లు, హారర్–కామెడీలు, యాక్షన్ డ్రామాలు, వెబ్ సిరీస్‌లతో ప్రేక్షకులను అలరించేందుకు పలు భాషల చిత్రాలు సిద్ధంగా ఉన్నాయి. అమెజాన్ ప్రైమ్ వీడియోలో 'వీరభద్రుడు', 'కరుప్పు', 'రమణి కల్యాణం', 'రాఖ్' వెబ్ సిరీస్‌తో పాటు పలు విదేశీ చిత్రాలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే 'పొంగలి', 'నాను కరుణాకర' చిత్రాలు కూడా ప్రేక్షకులను అలరిం చనున్నాయి. నెట్‌ఫ్లిక్స్‌లో 'భూత్ బంగ్లా', 'అవుట్‌లాస్ట్: ది జంగిల్', 'కలర్స్ ఆఫ్ ఈవిల్: బ్లాక్', 'ది ఈవిల్ లాయర్', 'ది పాలిగా మిస్ట్', 'ఐ యామ్ ఫ్రాంకెల్డా' వంటి చిత్రాలు, వెబ్ సిరీస్‌లు ప్రసారమవు తున్నాయి. ఆహా వీడియోలో 'ష్... సీజన్ 3' తొలి రెండు భాగాలు విడుదలయ్యాయి. ఉత్కంఠ భరితమైన కథాంశంతో ఈ సిరీస్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈటీవీ విన్‌లో 'రమణి కల్యాణం', 'సెకండ్ మ్యారే జ్' వెబ్ సిరీస్ అందుబాటులోకి వచ్చాయి. సన్ నెక్స్ట్‌లో 'రమణి కల్యాణం', 'శాలివా హన శాఖే ' చిత్రాలు ప్రసారమవు తున్నా యి. జియో హాట్‌స్టార్‌లో 'దృఢం' చిత్రం పలు భారతీయ భాషల్లో అందుబా టులో ఉండగా, జీ5లో కన్నడ చిత్రం 'వికల్ప' స్ట్రీమింగ్ అవుతోంది.



## కీర్తి సురేశ్ ఆసక్తికర

# వ్యాఖ్యలు

హైదరాబాద్ -- 13-06-2026 --

దక్షిణాది చిత్రసీమలో అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక కీర్తి సురేశ్ మరోసారి 'మహానటి' తరహా బలమైన పాత్రల్లో నటించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తన సినీ ప్రయాణం, కెరీర్‌లోని మలుపుల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'మహానటి' సినిమా తన జీవితాన్ని పూర్తిగా మార్చేసిందని, నటిగా తనకు కొత్త గుర్తింపును తీసుకొచ్చిందని కీర్తి చెప్పారు. ఇప్పటికీ ఆ చిత్రాన్ని గుర్తు చేసుకుంటే భావోద్వేగానికి గురవుతానని పేర్కొన్నారు. దివంగత మహానటి సావిత్రి జీవితకథ ఆధారంగా తెరకెక్కిన చిత్రంలో నటించే అవకాశం వచ్చినప్పుడు మొదట చాలా భయపడ్డానని ఆమె గుర్తుచేసుకున్నారు. కెరీర్ ప్రారంభ దశలోనే అంతటి గొప్ప నటీమణి పాత్ర పోషించడం పెద్ద బాధ్యతగా భావించానన్నారు. ఆ పాత్రకు న్యాయం చేయగలనా అనే సందేహం కూడా తనను వెంటాడిం దని చెప్పారు. అయితే దర్శకుడు, చిత్రబృం దం అందించిన సహకారంతో ఆ పాత్రలో పూర్తిగా లీనమయ్యానని తెలిపారు. సిని మా విడుదలైన తర్వాత ప్రేక్షకుల నుంచి వచ్చిన ఆదరణ తన జీవితంలో మరచి పోలేని అనుభూతిగా మిగిలిపో యింద న్నారు.






## మరోసారి వాయిదా అఖిల్ లెనిన్ పై

# కొత్త ప్రచారం

హైదరాబాద్ -- 13-06-2026 --

యువ హీరో అఖిల్ అక్కినేని కెరీర్‌లో అత్యంత కీలక చిత్రంగా భావిస్తున్న 'లెనిన్' మరోసారి వార్తల్లో నిలిచింది. చాలా కాలంగా సరైన వాణిజ్య విజయానికి ఎదురుచూస్తున్న అఖిల్‌కు ఈ చిత్రం కీలక మలుపు అవుతుందని అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం విడుదల కావాల్సిన ఈ చిత్రం పలు కారణాలతో ఇప్పటికే పలుమార్లు వాయిదా పడింది. దీంతో ఎట్టకేలకు జూన్ 26న సినిమా విడుదలవుతుందని అభిమానులు భావించారు. అయితే ఇప్పుడు ఈ చిత్రం మరోసారి వాయిదా పడినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, జూన్ 26 విడుదల తేదీ నుంచి చిత్రాన్ని జూలై తొలి వారానికి మార్చే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇప్పటివరకు చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ ప్రచారం బయటకు రావడంతో అఖిల్ అభిమానులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు వాయిదాలు ఎదుర్కొన్న ఈ సినిమా విషయంలో మరింత ఆలస్యం జరగడం వారిలో అసహనాన్ని పెంచుతోంది. సామాజిక మాధ్యమాల్లో కూడా చిత్రబృందం త్వరగా స్పష్టత ఇవ్వాలని అభిమానులు కోరుతున్నారు. గత చిత్రాలు ఆశించిన స్థాయిలో విజయాలు సాధించకపోవడంతో ఈసారి బలమైన కథతో ప్రేక్షకుల ముందుకు రావాలని అఖిల్ భావిస్తున్నాడు. భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న గ్రామీణ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం అఖిల్‌ను కొత్త కోణంలో చూపించనుందనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమలో భారీ చిత్రాల హవా కొనసాగుతున్న నేపథ్యంలో సరైన విడుదల తేదీ ఎంపిక విషయంలో నిర్మాతలు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే మరింత అనుకూలమైన సమయాన్ని ఎంచుకునేందుకు విడుదలను కొంతకాలం వాయిదా వేసే ఆలోచనలో ఉన్నారనే ప్రచారం సాగుతోంది.




## బిగ్ బాస్ 10 కు రంగం సిద్ధం

# దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ -- 13-06-2026 --

బుల్లితెరపై అత్యంత ప్రజాదరణ పొందిన రియాలిటీ షో 'బిగ్ బాస్ తెలుగు' మరో కొత్త సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే తొమ్మిది విజయవంతమైన సీజన్లను పూర్తి చేసుకున్న ఈ కార్యక్రమం, ఇప్పుడు పదో సీజన్‌కు సిద్ధమవుతోంది. కొత్త సీజన్ ఏర్పాట్లు ప్రారంభం కావడంతో అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈసారి కూడా కింగ్ అక్కినేని నాగార్జున హోస్ట్‌గా వ్యవహరించనున్నట్లు తాజాగా విడుదలైన అధికారిక ప్రచార చిత్రంతో స్పష్టమైంది. నాగార్జున మరోసారి తన ప్రత్యేక శైలిలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతుండటంతో కార్యక్రమంపై అంచనాలు మరింత పెరిగాయి. గత సీజన్‌లో ప్రవేశపెట్టిన 'అగ్నిపరీక్ష' భావనకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ప్రముఖులతో పాటు సామాన్య ప్రజలకు కూడా బిగ్ బాస్ ఇంట్లోకి వెళ్లే అవకాశం కల్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆ విజయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి 'అగ్నిపరీక్ష–2'ను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. తమలోని ప్రతిభను ప్రపంచానికి చూపించాలని భావించే సాధారణ అభ్యర్థులకు మరోసారి అవకాశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. బిగ్ బాస్ ఇంట్లోకి వెళ్లాలనే ఆసక్తి ఉన్న వారు తమ వ్యక్తిత్వం, ప్రతిభ, ప్రత్యేకతలను తెలియజేసేలా ఒక వీడియో రూపొందించి పంపించాల్సి ఉంటుంది. ఆ వీడియోలో తమ గురించి, ఎందుకు బిగ్ బాస్‌లో పాల్గొనాలనుకుంటున్నారో వివరించాల్సి ఉంటుంది. నిర్వాహకులు విడుదల చేసిన వివరాల ప్రకారం, జూన్ 12 నుంచి జూన్ 20 వరకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగనుంది. ఈ గడువులోపు ఆసక్తి ఉన్న

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467